# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - మంగళవారం 8 జూలై 2025 | సంపుటి:9 | సంచిక:191 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


### బ్యాంకును ముంచెత్తిన వరద నీరు



తమ నగదు, బంగారం డిపాజిట్లపై ఖాతాదారుల ఆందోళన 2

### 2035 నాటికి ప్రపంచ క్వాంటమ్ కేంద్రంగా అమరావతి



2

---

అప్పుడే భయపడలేదు..

## రప్పా, రప్పాకు భయపడతామా



**నెల్లూరు:** ప్రతిపక్షంలో ఉన్నా మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డిలో మార్పు రాలేదని, ఇప్పటికీ హెలికాప్టర్లలోనే తిరుగుతున్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. నెల్లూరు పట్టణ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో మంత్రి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఎక్కడికి వెళ్లినా మనుషుల్ని చంపుకుంటూ వెళ్తున్నారని.. పల్నాడు జిల్లా పర్యటనలో ఒకరిని పరామర్శించడానికి వెళ్లి ముగ్గురిని చంపారని మండిపడ్డారు. 'జన సమీకరణ మనం చేయలేక కాదు.. మనవల్ల ప్రజలు ఇబ్బంది పడకూడదు. కారు కింద కార్యకర్త పడితే కనీసం దిగి చూడలేదు. దిగి చూసి ఆసుపత్రికి పంపించి ఉంటే బతికేవాడు. బాధిత కుటుంబం తల్లిని తీసుకువచ్చి కనీసం కూర్చోపెట్టలేదు. గ్లాస్ మంచినీరు అయినా ఇచ్చారా?. సొంత కార్యకర్త చనిపోతే నిల్చొని రెండు భుజాలు తట్టి వెళ్లిపోయారు' అంటూ ఫైర్ అయ్యారు.

వైసీపీ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌ను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ హయాంలోనే 164 మంది కార్యకర్తలను చంపారని.. అప్పుడే భయపడలేదని.. రప్పా, రప్పాకు భయపడతామా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు ఇంటి గేటుకు తాళ్లు కట్టారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా తిరిగే హక్కు ఉందన్నారు. కానీ తిరగమంటే మనుషులను చంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించమంటే ఎదురుదాడి చేస్తున్నారన్నారని మంత్రి లోకేష్ ఫైర్ అయ్యారు.

---

## శ్రీశైలంలో జలహారతి.. పాల్గొననున్న సీఎం



**నంద్యాల:** శ్రీశైలం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందర్శించనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న జలహారతి కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువ ఉన్న నాగార్జునసాగర్ కు నీళ్లు విడుదల చేసే కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారు. మంగళవారం సాయంత్రం లేదా బుధవారం శ్రీశైలం గేట్లు ఎత్తేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడుకి ఆహ్వానం పంపారు. గంగాహారతి కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొనున్నారు.జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి భారీఎత్తున వరదనీరు వచ్చి చేరుతుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా జలకళతో తొణికిసలాడుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం భారీగా పెరుగుతోంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా.. ఇప్పటికే 882 అడుగులకు చేరుకుంది. 216 టీఎంసీలకు గాను194 టీఎంసీలు ఉంది. దీంతో మంగళవారం అధికారికంగా గేట్లు ఎత్తేందుకు ప్రాజెక్ట్ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేయనున్నారు. జలహారతి కార్యక్రమంలో భాగంగా గేట్లు ఎత్తిన తర్వాత కృష్ణమ్మకు చీరసారెలు సమర్పిస్తారు. ఉదయం నిర్వహించనున్న ఈ ప్రత్యేక కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు సహా స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు హాజరుకానున్నారు.

---



జగన్ ప్రతిపక్షానికి కూడా

## పనికిరాడు..

### దేవినేని ఉమ సెటైర్లు

**అమరావతి:** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మాజీ మంత్రి, తెలుగుదేశం సీనియర్ నేత దేవినేని ఉమా మహేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ఐదేళ్లలో చేయని అభివద్ధి.. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు ఏడాదిలోనే చేసి చూపించారని ఉద్ఘాటించారు. ఐదేళ్లలో ఏమి చేశారో జగన్ ప్రజలకు చెబితే బాగుంటుందని చెప్పుకొచ్చారు. బెయిల్‌పై ఉన్న ముద్దాయి చట్టాలను కాపాడే వ్యవస్థలను బెదిరించేలా బరితెగింపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో దేవినేని ఉమ మీడియాతో మాట్లాడారు.

---

## శ్రీశైలంలో శాకాంబరీ ఉత్సవం



**శ్రీశైలం జులై 7(మనంన్యూస్):** శ్రీశైల మహా క్షేత్రంలో ఆషాడ పౌర్ణమి సందర్భంగా ఈనెల 10వ తారీకు శ్రీ భ్రమరాంబ అమ్మవారి కి వివిధ రకాల కూరగాయలు ఆకుకూరల తో అలంకరించి శాకంబరి ఉత్సవం నిర్వహించ నున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. శాకాంబరి ఉత్సవంలో అమ్మవారి ఆలయ ప్రాంగణం మొత్తం వివిధ రకాల కూరగాయలతో, ఆకుకూరలతో అలంకరణ జరగనున్నట్లు తెలిపారు.

---

## ఉత్సాహంగా 'సుపరిపాలనలో తొలి అడుగు'

**నక్కపల్లి:** రాష్ట్ర వ్యాప్తంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లి, ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం దేవవరంలో ె మంత్రి అనిత పర్యటించారు. రాబోయే నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాలను గ్రామస్థులకు వివరించారు. విశాఖ జిల్లా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సింహాచలంలో 'తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారులకు, అన్ని పథకాలు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు.ప్రజల ఆలోచనలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. తెనాలిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కడప జిల్లా లింగాల మండలంలో పర్యటించిన మంత్రి సబిత.. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవితో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా?అని ఆరా తీశారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తామన్నారు. జమ్మలమడుగు మండలం గండికోట, కన్నెలూరులో మంత్రి బీసీ జనార్ధన్ పర్యటించారు. ఇంటింటికీ తిరిగి



కరపత్రాలు అందజేశారు. ఎన్నికల్లో జగన్ దారుణంగా ఓడిపోయినా.. 'రీకాల్ చంద్రబాబు' కార్యక్రమం చేపట్టడం సిగ్గు చేటని విమర్శించారు. వైకాపా ఇప్పటికే కాలగర్భంలో కలిసిపోయిందని ఎద్దేవా చేశారు.

---

## తిరుమల శ్రీవారి సేవలో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి

**తిరుమల,జూలై 07,మనం న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని సోమవారం ఉదయం నైవేద్య విరామ సమయం అనంతరం తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ్ రవి ( ఆర్.ఎన్. రవి ) కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూ లైన్ ద్వారా ఆలయం మహా ద్వారం వద్దకు చేరుకున్న వీరికి టీటీడీ ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బీ.ఆర్ నాయుడు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బీ.ఆర్ నాయుడు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.



---

నేటి నుండి దుర్గ గుడి శాకాంబరీ

## ఉత్సవాలు ప్రారంభం

**విజయవాడ పశ్చిమ జులై 7 (మనం న్యూస్):** రాష్ట్రంలోనే రెండవ స్థానంలో ఉన్న విజయవాడ ఇంద్రకీలాద్రి పైన వేంచేసిన కనకదుర్గమ్మ ఆలయంలో నేటి నుంచి శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. నేటి ఉదయం ప్రారంభమయి ఈ నెల 10న ముగియనున్నాయి. శాకాంబరీ ఉత్సవాలు తొలి రోజు దర్శన సమయం కూడా ఉదయం రోజూ మాదిరిగానే సమయపాలన ఉంటుందన్నారు. అమ్మవారు కూరగాయల అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అయితే తొలి రోజు అలంకరణకు కావలసిన కూరగాయన్నీ దాతల సహకారంతో మాత్రమే ఏర్పాటు చేశారు. తొలిరోజు (పది టన్నులు) కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తో అలంకరణ ప్రారంభం.



---



## దలైలామాకు భారతరత్న ఇయ్యాలె

### ప్రభుత్వానికి అఖిలపక్ష ఎంపీల లేఖ

**హైదరాబాద్, మనం ప్రతినిధిః** టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామాకు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న'ను ప్రదానం చేయాలని పలు పార్టీలకు చెందిన ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగించేందుకు ఆయనకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వివిధ పార్టీల ఎంపీలతో కూడిన 'అఖిలపక్ష భారత పార్లమెంటరీ ఫోరమ్ ఫర్ టిబెట్' ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాలు చేసింది. బీజేడీ రాజ్యసభ ఎంపీ సుజీత్ కుమార్ నేతృత్వంలోని ఈ ఫోరంలో బీజేపీ, జేడీ(యూ) వంటి పార్టీల ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. దలైలామాకు 'భారతరత్న' ఇవ్వాలన్న డిమాండ్‌కు మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించినట్లు ఫోరమ్ కన్వీనర్ సుజీత్ కుమార్ తెలిపారు. టిబెట్ ఆధ్యాత్మిక వారసత్వ నాయకుడి ఎంపిక

...మిగతా 2లో

---

## మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కి అస్వస్థత

### ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు

**విజయవాడ తూర్పు, జూలై 07 (మనం న్యూస్):** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. సోమవారం నాడు విజయవాడ బందర్ రోడ్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ఆయన చేరారు. ముక్కులో ఒక వైపు శ్వాస నాళం పూడి పోవడంతో శ్వాస తీసుకోవడానికి ఆయన ఇబ్బంది పడుతున్నారు. సబ్ జైల్లో ఉండగా కొన్నిసార్లు తీవ్ర ఇబ్బందికి గురవటంతో ప్రభుత్వాసుపత్రితో పాటు ఆయుష్ ఆసుపత్రిలోనూ చికిత్స పొందినట్లు తెలుస్తోంది. బెయిల్ మీద బయటకు వచ్చిన



తర్వాత ఆయన తేలప్రోలు లోని తన నివాసంలో ఉంటున్నారు. ప్రతిరోజు గన్నవరం, హనుమాన్ జంక్షన్,

...మిగతా 2లో

---

## ఆ విద్యార్థుల విషయంలో జగన్ నిర్లక్ష్యం వహించారు.. మీరైనా పట్టించుకోండి: వైఎస్ షర్మిల

**వైఎస్సార్ కడప:** వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఆర్ట్స్ యూనివర్సిటీలో విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మద్దతు తెలిపారు. సీవోఏ అనుమతులు లేకుండా విద్యార్థులను ఎలా తీసుకున్నారని వర్సిటీ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

"ఒక్కో విద్యార్థి రూ.15లక్షల మేర ఖర్చు పెట్టి చదివారు. ఐదేళ్ల కోర్సు పూర్తి చేసుకోబోతున్నారు. ఇలాంటి సమయంలో వాలిడేటెడ్ సర్టిఫికెట్ వస్తుందో లేదో తెలియదు. ఇది చాలా బాధాకరం. 2020లో యూనివర్సిటీని స్థాపించారు. అప్పుడు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అనుమతి ఇవ్వలేదు. తొలి బ్యాచ్‌లో చేరికలకు ప్రభుత్వం మభ్యపెట్టింది. ఇప్పటి వరకు



తొలి బ్యాచ్ ఎన్‌రోల్‌మెంట్ కాలేదు. ఇలా ఎలా విద్యార్థుల జీవితాలను ఫణంగా పెట్టారు. ఇది జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాశ్‌రెడ్డి నిర్లక్ష్యం. ఇక్కడ అనుమతులు లేవని తెలిసి ఎందుకు మౌనంగా ఉన్నారు?అధికారంలో ఉన్నప్పుడు అనుమతుల కోసం ఎందుకు ప్రయత్నాలు చేయలేదు? సీవోఏ దిల్లీలోనే ఉంటుంది కదా.. ఎంపీ అవినాశ్ ఎందుకు వారితో మాట్లాడలేదు?

ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. గత ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానికి లేదా? ఏడాదిగా సీవోఏ అనుమతులు కావాలని విద్యార్థులు పోరాటం చేస్తున్నారు. కేంద్రంలో భాజపా అధికారంలో ఉంది.. సీవోఏ దిల్లీలోనే ఉంది. కేంద్రప్రభుత్వాన్ని చేతుల్లో పెట్టుకొని ఈ చిన్న పనిని ఎందుకు పట్టించుకోట్లేదు? సర్టిఫికెట్ లేకుంటే విద్యార్థుల జీవితాలు ఏమవ్వాలి? చంద్రబాబు, పవన్, లోకేశ్ దీనికి సమాధానం చెప్పాలి. ఆర్కిటెక్చర్ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది" అని వైఎస్ షర్మిల అన్నారు.

---

## రూ.100తో వారసత్వ భూముల రిజిస్ట్రేషన్

**అమరావతి:** గ్రామ/వార్డు సచివాలయాల్లో నామమాత్ర ఫీజుతో.. వారసత్వ భూముల సంక్రమణ భాగస్వామ్య రిజిస్ట్రేషన్‌లు త్వరలో జరగనున్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్ధారించిన మార్కెట్ విలువ ప్రకారం సదరు ఆస్తి విలువ రూ.10లక్షల లోపు ఉంటే రూ.100, ఆపైన ఉంటే రూ.1,000 ఫీజును స్టాంపు డ్యూటీ కింద తీసుకోనున్నారు. ఆస్తి యజమానులు మరణించిన అనంతరం వారసులకు సంక్రమించే వాటికి మాత్రమే గ్రామ/వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తారు. మిగిలిన వాటిని యథావిధిగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే చేస్తారు. తల్లిదండ్రులు మరణించిన అనంతరం వారసత్వంగా వచ్చే ఆస్తులను వారసులు.. తహసీల్దారుకు

...మిగతా 2లో

---

## తన నీడను కూడా నమ్మని ట్రంప్!

### అందుకే శత్రువులవుతున్న మిత్రులు

### అందరితోనూ వివాదాలే

### తాజాగా ఆ జాబితాలో మస్క్





**వాషింగ్టన్, జూలై 7:** డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడై ఆరు నెలలైనా గడవక ముందే మిత్రులు శత్రువులుగా మారుతున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఎన్నికల్లో తనకు నీడలా వెంట ఉండి గెలిపించిన వారూ శత్రువులుగా మారడం. ప్రస్తుతం ఆయనపై విమర్శలు చేస్తున్న వారిలో చాలా మంది గతంలో అత్యంత సన్నిహితులే. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ నుంచి మాజీ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ దాకా ఎంతో మంది ఇప్పుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా గొంతు విప్పుతున్నారు. ఆయన అనుసరిస్తున్న పాలనా విధానాలను ఎండగడుతున్నారు. బిగ్ బ్యూటిఫుల్ చట్టం నుంచి విదేశాంగ విధానాలదాకా ట్రంప్ సర్కారు తీసుకుంటున్న నిర్ణయాలను

...మిగతా 2లో

# 2035 నాటికి ప్రపంచ క్వాంటమ్ కేంద్రంగా అమరావతి..



**అమరావతి:** క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్‌ను ఏపీ ప్రభుత్వం ఆమోదించింది. జూన్ 30న విజయవాడలో క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాప్‌లో చేసిన డిక్లరేషన్‌కు ఆమోదం లభించింది. ఈ మేరకు ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. అమరావతిని క్వాంటమ్ గేట్ వే హబ్‌గా అభివద్ధి చేయడమే లక్ష్యంగా ''అమరావతి క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్''ను రూపొందించారు. క్వాంటమ్ పరిశోధన, ఆవిష్కరణ, అభివద్ధి, మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

దేశంలోనే అతి పెద్ద క్వాంటమ్ బెడ్‌గా క్యూ-చిప్-ఇన్‌ను వచ్చే 12 నెలల్లో అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2035 నాటికి ప్రపంచ క్వాంటమ్ కేంద్రంగా అమరావతి అభివద్ధే లక్ష్యమని ఉత్తర్వుల్లో ప్రభుత్వం వెల్లడించింది. 2026లో ప్రారంభమయ్యే అమరావతి క్వాంటమ్ అకాడమీ ద్వారా శిక్షణ, ఫెలోషిప్‌లు అందజేయాలని నిర్ణయించారు.

# దలైలామాకు భారతరత్న ఇయ్యాలె

(మొదటి పేజీ తరువాయి)

విషయంలో చైనా జోక్యాన్ని ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకించారు. 14వ దలైలామా వారసుడిని ఎన్నుకునే హక్కు కేవలం టిబెట్ ప్రజలకు మాత్రమే ఉందని వారు స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు భారీ ర్యాలీ నిర్వహించాలని అరుణాచల్ ప్రదేశ్ ఎంపీ తాపిర్ గావో సూచించారు. ఇటీవల అమెరికా కాంగ్రెస్ టిబెట్‌కు అనుకూలంగా ఆమోదించిన బిల్లును ఈ ఫోరమ్ ప్రశంసించింది. మన దేశ పార్లమెంటులోనూ అలాంటి చట్టాన్ని తీసుకురావాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, దేశంలోని టిబెటన్ శరణార్థుల నివాస ప్రాంతాలను సందర్శించి, వారికి రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించేలా స్థానిక యంత్రాంగాలపై ఒత్తిడి తీసుకురావాలని ఎంపీలకు సూచించారు. ఈ పరిణామం చైనాతో దౌత్యపరమైన సంబంధాల విషయంలో భారత్‌కు మరోసారి సవాలుగా మారే అవకాశం ఉంది.

**దలైలామాకు మోదీ శుభాకాంక్షలు..**

టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా 90వ పుట్టినరోజు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. అయితే, దీనిపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం నాడు భారత్‌కు తమ నిరసనను అధికారికంగా తెలియజేసినట్లు ప్రకటించింది. టిబెట్‌కు సంబంధించిన అంశాల సున్నితత్వాన్ని భారత్ పూర్తిగా అర్థం చేసుకోవాలని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ హెచ్చరించారు.

## మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కి అస్వస్థత

(మొదటి పేజీ తరువాయి)

వీరవల్లి ఆత్కూరు, పోలీస్ స్టేషన్లలో కోర్టు ఆదేశాల మేరకు వివిధ కేసుల నిమిత్తం హాజరవుతున్నారు. అందులో భాగంగా ప్రతి శనివారం ఆయా పోలీస్ స్టేషన్లకు వెళ్లి సంతకాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్యపరంగా కొంత ఒత్తిడికి లోనవుతున్నట్లు తెలుస్తోంది. ఉన్నత న్యాయస్తానం ఆధేశాల మేరకు అన్ని స్టేషన్లకు వెళ్లి వస్తున్నారు వంశీ. ఇదిలా ఉండగా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు వంశీకి అన్ని పరీక్షలు నిర్వహించి ముక్కులో శ్వాస నాళం పూడిపోయిందని, అందువల్ల శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుందని గుర్తించారు. వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పారు. దీంతో ఆయన సోమవారం నాడు విజయవడ బందరు రోడ్డులోని ప్రయివేటు ఆసుపత్రిలో చేరారని సమాచారం.

# రూ.100తో వారసత్వ భూముల రిజిస్ట్రేషన్

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తుచేసి, కాగితాలపై రాసుకుంటున్నారు. వీటికి మ్యుటేషన్‌లు సకాలంలో జరగడం లేదని, తహసీల్దారు కార్యాలయాల సిబ్బంది పదేపదే తిప్పుతున్నారన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందుతున్నాయి. గత ఏడాదిలో సుమారు 55 వేల ఫిర్యాదులు ఇలా ప్రభుత్వానికి అందాయి. మరోవైపు.. తమ ఆస్తికి ఎందుకు రిజిస్ట్రేషన్ చేయించాలి అనే ఉద్దేశంతో కొందరు ఉంటున్నారు. దీనివల్ల చనిపోయిన వారి పేర్లు భూముల రికార్డుల్లో అలాగే ఉండిపోతున్నాయి. ఫలితంగా పలు సమస్యలు తలెత్తుతున్నాయి.

**మరింత సులువు..**

గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా మరణ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయి. యజమాని మరణించిన అనంతరం వచ్చిన ఆస్తులను వారసులు భాగాలు చేసుకుని లిఖితపూర్వకంగా ఏకాభిప్రాయంతో వస్తే గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తారు. సచివాలయాల్లో.. అది కూడా నామమాత్ర ఫీజులతో రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా వారసులు ముందుకు వస్తారని అంచనా వేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేయడం వల్ల భూముల రికార్డుల్లో వివరాల నమోదు (మ్యుటేషన్) ఆటోమేటిగ్గా జరుగుతుంది. ఈ-పాస్‌బుక్ కూడా జారీ అవుతుంది. వారసులుగా ఉన్న వారి నుంచి ఈ-కేవైసీ సైతం తీసుకుంటారు.

ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు జారీచేసిన ఆదేశాల ప్రకారం.. రెవెన్యూ శాఖ నుంచి ఈ విధానం అమలుపై మార్గదర్శకాలు రానున్నాయి. దీనికి అనుగుణంగా రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ చర్యలు తీసుకుంటుంది. ఇందుకు కనీసం రెండు, మూడు నెలల సమయం పట్టనుంది. గత వైకాపా పాలనలో గ్రామ/వార్డు సచివాలయాల్లో అనాలోచితంగా ప్రవేశపెట్టిన దస్తావేజుల రిజిస్ట్రేషన్ గందరగోళానికి దారితీసింది. ఇప్పుడు వారసత్వ భూములకే రిజిస్ట్రేషన్ చేస్తారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరుగుతుంది. ఈ రిజిస్ట్రేషన్‌లు ఎలా చేయాలన్న దానిపై డిజిటల్ అసిస్టెంట్లకు మరోదఫా శిక్షణ ఇచ్చే అవకాశముంది.

# సుపరిపాలన తొలి అడుగు

- రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే మ ప్రభుత్వ లక్ష్యం
- సూపర్ సిక్స్ పథకాలు అర్హులైన ఇస్తున్నాం



**బేతంచర్ల, జూలై 7(మనంన్యూస్):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిగా చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్రం ముఖ్యమంత్రి చేపట్టిన సుపరిపాల తొలి అడుగు కార్యక్రమాన్ని మండలపరిదిలో హెచ్ కొట్టాల కొమ్మూరు కొట్టాల గొర్లగుట్ట గ్రామాలలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ గ్రామాలలో ఘన స్వాగతం పలికారు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని హెచ్ కొట్టాల ఇంటింటికి వెళ్లి మహిళలకు కరపత్రాలు అందిస్తూ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అర్హులైన వారికి వస్తున్న విషయాన్ని వారిని అడిగి తెలుసుకున్నారు గ్రామంలో ఉన్న సమస్యలు వాటికి సంబంధించిన అధికారులకు తెలిపి సమస్యలు పరిష్కరించాలని అన్నారు కొమ్మూరు కొట్టాల గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఇస్తున్న పథకాల కరపత్రాలను ఇస్తూ మహిళలు ప్రజలు అందరూ నమ్మకంతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని ఇచ్చిన హామీలను అర్హులైన వారి సూపర్ సిక్స్ పథకాలు ఇస్తున్నామన్నారు

గొర్లగుట్ట గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాల లో తల్లికి వందనం ఇంటిలో ముగ్గురు ఉంటే ముగ్గురు తల్లికి వందనం ఇస్తున్నాం గతంలో ఒక్కరికి పథకం ఇచ్చేవారని విద్య కోసం ఎవరికి ఇబ్బంది లేకుండా ముగ్గురికి చదవడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తున్నామని అన్నారు గ్రామంలో సమస్యలు తెలుపగా వాటికి సంబంధించిన అధికారులకు తెలిపి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు గ్రామంలో ఉన్న బురుజు గోడలు కూలిపోవడంతో అక్కడ ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి కి తెలపగా పంచాయతీరాజ్ ఏ ఈ మహేష్ ను పిలిచి బురుజు కూలిన గోడలు కట్టాలని అన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఉన్నాం ఎల్ల నాగయ్య పోలూరు రాఘవరెడ్డి సోమశేఖర్ రెడ్డి బుగ్గన ప్రభాకర్ ఉన్నాం చంద్రశేఖర్ రెడ్డి దస్తగిరి రెడ్డి ముల్లా వర్ధన్ రెడ్డి ఎరుకల చెరువు శివ భీమేష్ రెడ్డి భీమారెడ్డి యంగన్న నందీశ్వరుడు పురుషోత్తం రావు మద్ది రెడ్డి బ్రహ్మయ్య గోపాల్ రెడ్డి రమణ తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ




**కర్నూల్ జులై 7( మనం న్యూస్):** ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ మంద కృష్ణ మాదిగ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గ్రామస్తులు కర్నూలు జిల్లాలోని పంచలింగాల గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ ఎమ్మార్పీఎస్ నాయకులు ముప్ప సాని సుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముందుగా నేషనల్ హైవే హైదరాబాద్ రహదారి నుంచి ఎమ్మార్పీఎస్ జెండా తో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ కు గ్రామస్తులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం కేక్ కట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజు, బాబు తదితర ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు పంచలింగాల గ్రామం కర్నూల మండలం ఎంఆర్పిఎస్ జెండా ఆవిష్కరణ గత 31 సంవత్సరంలో అట్టడుగు తున్న దారుణంగా అణిచివేయబడుతున్న తరుణంలో 1994 జులై 7న ఎమ్మార్పీఎస్ ప్రకాశం జిల్లాలో ఈదుముడి గ్రామంలో కొంతమంది మేధావుల్లో మందకృష్ణ మాదిగ కొమ్మూరి కనకరావు కృపాకర్ మాదిగ ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ మరి కొంతమంది కలిసి 1994 7 జులై 7న జెండావిష్కరణ చేసి మాదిగలకు పెద్దది ఎక్కువ ఏర్పడి వర్గీకరణ కోసం 30 సంవత్సరాలు సుదీర్ఘంగా పోరాడిన మాదిగలు ఎంతో మంది కుల సంఘ నాయకులు పోరాటంలో అసలు భాషలు అందుకు ప్రజలు మాదిగలు ఈ వర్గీకరణ మాదిగలకు వచ్చినందుకు మందకృష్ణ మాది కి ఆయన పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ పంచలింగాల గ్రామం నుండి ఎంఆర్పిఎస్ ఉద్యమానికి జెండాకు పంచలింగాల గ్రామంలో గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ కృష్ణ యాదవ్ వచ్చి మాదిగలకు నా వంతుగా నేను సాయం చేస్తానని ఎమ్మార్పీఎస్ జెండాకు పూలు మాలవేసి స్వాగతం పలికారు అలాగే గ్రామ ప్రజలు పెద్దలు గాలి రాజు ముప్పసాని సుధాకర్ మాదిగ బాబు ఎం రాజు రాజేష్ భాస్కర్ డేవిడ్ సత్యానందం ఎం తిక్కరాజు ఇర్మియ మొదలగువారు జెండా ఆవిష్కరించి శుభాకాంక్షలు చెప్పారు.



## విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

- జిల్లా ఎస్పీ

**కర్నూలు జూలై 7 (మనం న్యూస్):** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను . జిల్లా ఎస్పీ ఆదేశించారు. కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 85 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా , సీఐ లు పాల్గొన్నారు.

# ఖరీఫ్ పంటల కోసం కాలువల ద్వారా నీటి విడుదల

- కలెక్టర్ పి.రంజిత్ బాషా




**ఆదోని, జూలై 7 (మనం న్యూస్):** ఖరీఫ్ (2025-26) పంటలకు తగినంత నీటి సరఫరా చేయడం కోసం జిల్లాలోని ప్రధాన కాలువల ద్వారా నీటి విడుదలపై జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో ఆదోని ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి వాల్మీకి, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జాయింట్ కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్, వ్యవసాయ, నీటి పారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రైతులకు తగిన మేలు చేకూర్చే విధంగా ప్రధాన ఆయకట్టు ప్రాంతాలకు సకాలంలో నీరు విడుదల చేయాలని అధిక విభాగాలన్నీ సమన్వయంతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు.

**రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా నీటి వాడకం**

జిల్లా రైతులు ఎదురుచూస్తున్న ఖరీఫ్ సాగుకు అవసరమైన నీరు సకాలంలో అందేలా చూడడం మన బాధ్యత. ఒక వైపు వర్షపాతం తక్కువగా ఉన్నా, మరొక వైపు భూగర్భజల వనరులు తగ్గుతున్న నేపథ్యంలో ఒక్కో లీటర్ నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలి. కాలువల పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి అని కలెక్టర్ పి.రంజిత్ బాషా స్పష్టం చేశారు.

**అధికారుల సమీక్ష**

ఈ సందర్భంగా అధికారులు జిల్లాలోని ప్రధాన జలాశయాల జలనిల్వలు, సాగు అవసరాలను వివరించారు. ఆయకట్టు రైతులు పంటల రూపకల్పనలో మార్పులు చేసుకోవాలని, నీటి వినియోగం దృష్టిలో పెట్టుకుని పంటల పద్ధతులను అనుసరించుకోవాలని సూచించారు.

సమావేశంలో పాల్గొన్న ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి వాల్మీకి మాట్లాడుతూ, రైతులు కష్టపడితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. కాలువల ద్వారా నీరు సక్రమంగా అందించేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి అని సూచించారు.

**ముఖ్యంగా చ్చన అంశాలు:ప్రధాన కాలువల దుర్గతి తొలగించడం**

పంటల వారీగా నీటి కేటాయింపు ప్రణాళిక రైతులకు అవగాహన కార్యక్రమాలు నిషేధిత పంటలపై శ్రద్ధ వహించాలన్నారు, ఈ సమావేశం చివరగా జిల్లా కలెక్టర్ అందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు.

## 10న మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశం

- పిల్లలు బంగారు భవిష్యత్తు కోసం.. బడివైపు ఒక అడుగు
- ఎంఈవో వెంకటేశ్వర్లు



**తుగ్గలి జులై 7(మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టీచర్స్ - పేరెంట్స్ కార్యక్రమాన్ని మండలంలో అన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించాలని మండల విద్యాధికారి రమా వెంకటేశ్వర్లు సూచించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ పేరెంట్స్ -టీచర్ మీటింగుకు పిల్లలు తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల విద్య కమిటీ చైర్మన్లు,ప్రజా ప్రతినిధులు,పూర్వ విద్యార్థులు, పదవ తరగతి ఉత్తమ ర్యాంకులు విద్యార్థులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశాల వల్ల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య సంబంధాలు బలపడతాయన్నారు. పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమంలో సంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసి తల్లిదండ్రులను భాగస్వామ్యం చేద్దామని సూచించారు.

# ముగిసిన మొహర్రం



**తుగ్గలి జులై 7(మనం న్యూస్):** తుగ్గలి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మొహర్రం పండగ సందర్భంగా కొలువైన పీర్లు చిన్న సరిగెత్తు,పెద్ద సరిగెత్తు వేడుకలను నిర్వహించారు.సోమవారం మొహర్రం వేడుకలు ముగియడంతో పీర్లను మంగళ వాయిద్యాలతో యువకులు కోలాహం మధ్యన ఊరేగింపు చేశారు.ముగింపు వేడుకలకు పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు వచ్చి తిలకించారు.

## అత్యాచారం కేసు ముద్దాయిని అరెస్ట్ చేసిన ఆదోని రూరల్ పోలీసులు

చాకచక్యంతో పట్టుకున్న పోలీస్ బృందాన్ని సర్కిల్ ఇన్స్పెక్టర్ సి.నల్లప్ప అభినందన



**ఆదోని, జూలై 7 ( మనం న్యూస్):** ఇటీవల ఆదోని పట్టణ సరిహద్దులోని ప్రవల్లిక గార్డెన్స్ వద్ద చోటు చేసుకున్న అత్యాచారం కేసులో ముద్దాయి సంగిపోగు రమేష్, ఇస్వీ గ్రామం, ఆదోని మండలాన్ని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం, ఈనెల 4వ తేదీ రాత్రి జరిగిన ఈ దారుణ ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ముద్దాయి సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, సర్కిల్ ఇన్స్పెక్టర్ సి.నల్లప్ప మార్గదర్శకత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సురక్షితంగా అతడిని పట్టుకునే క్రమంలో చాకచక్యాన్ని ప్రదర్శించారు. సాయంత్రం 6:45 గంటలకు కడితోట క్రాస్ రోడ్ వద్ద రమేష్ను అదుపులోకి తీసుకొని రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. ముద్దాయిని అదుపులోకి తీసుకొచ్చే పనిలో పాల్గొన్న హెడ్ కానిస్టేబుల్ జానీవాకర్, కానిస్టేబుళ్లు కాసీం, సురేష్, కాశీలింగం, శ్రీనివాస్ల విశేష కృషిని సి.నల్లప్ప అభినందించారు. నేరాలు చేయటానికి యావత్ యావత్తుగా అనుకునే వారు, పోలీసులు మళ్లీ పట్టుకోలేరని భావించకూడదు. చట్టం ఎవరికీ రాదు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి కేసును కఠినంగా విచారిస్తాం' అని ఆయన స్పష్టం చేశారు.

## రేషనలైజేషన్‌లో భాగంగా కొత్త పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటు

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య...



**కర్నూలు జూలై 7(మనం న్యూస్):** రేషనలైజేషన్ లో భాగంగా క్రొత్త పోలింగ్ స్టేషన్ ల ఏర్పాటు చేయడం జరిగినది అని పాణ్యం నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య నియోజకవర్గ రాజకీయ పార్టీ ప్రతి నిధుల సమావేశంలో పేర్కొన్నారు. సోమవారం సాయంకాలం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీ ప్రతినిధులు మరియు తహసీల్దారుల సమావేశం పాణ్యం నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య నిర్వహించారు.ఈ సందర్భంగా ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ ఒక పోలింగ్ స్టేషన్ లో 1200 ఓట్లు మాత్రమే ఉండాలని అంతకుమించినప్పుడు వేరొక సమీప పోలింగ్ స్టేషన్ లలో కి మార్చడం కానీ క్రొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడము జరుగుతుందని తెలిపారు. ఆ విధంగా చేయగా ప్రస్తుతం కల్లూరు మండలంలో - 14 ,ఓర్వకల్లు మండలంలో - 4 ,పాణ్యం మండలంలో- 1 పెరిగాయని రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలియజేశారు. కొత్తగా పెరిగిన పోలింగ్ స్టేషన్ లు అన్నియు దాదాపు ఒకే భవన సముదాయంలో వేరే గది లో ఉంటాయని తెలిపారు.కాలేజీలు తెరిచినందున 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లను నమోదు చేసుకోవాలని వారిని ఫారం - 6 ద్వారా నమోదు చేయాలని , వేరే ప్రదేశాల నుండి వచ్చిన వారిని ఫారం- 8 ద్వారా నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో రెండవ అతిపెద్ద నియోజకవర్గం పాణ్యం అని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పోలింగ్ స్టేషన్ లు ఏర్పాటు చేయాలని , ఓటు వేయడానికి వాహనాలు తిరిగే రోడ్డు దాటి వెళ్లకుండా చూడాలని , వీలైనంత వరకు ప్రజలకు నడిచి వెళ్లేంత దగ్గరలో పోలింగ్ స్టేషన్ ఉండేలాగా చూడాలని ఎలక్ట్రోరల్ అధికారిని కోరారు. ఈ సమావేశానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కల్లూరు తాహసిల్దార్ కె .ఆంజనేయులు, ఓర్వకల్లు తాహసిల్దార్ బి.వి.ఎన్.విద్యాసాగర్, గడివేముల తాహసిల్దార్ ఎస్.వెంకటరమణ, పాణ్యం తహసిల్దార్ వై.నరేంద్ర నాథ్ రెడ్డి, ఎలక్షన్ డిప్యూటీ తాహసిల్దార్ జి.అనురాధ, జనసేన పార్టీ తరపున తోళ్ళ మంజునాథ్, టిడిపి తరపున టీ.చౌడయ్య మరియు నాగేశ్వర్ రెడ్డి ,సిపిఎం తరపున జి.రామకృష్ణ లు పాల్గొన్నారు.

## బీసీ. ఎస్సీ హాస్టల్లో విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు తక్షణమే పెంచాలి



**కర్నూలు జూలై 07మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు తక్షణమే మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కర్నూలు జిల్లా కలెక్టర్ కి పబ్లిక్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయడం జరిగింది ఈ సందర్భంగా ₹ జిల్లా కార్యదర్శి మహేష్₹ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్య మంత్రివర్యులు ,ఉపముఖ్యమంత్రి వర్యులు, విద్యాశాఖ మంత్రి వర్యులు, బిసి సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎక్కడికెళ్లిన వారు తాగే టి 150 రూపాయలు ఉంటుంది మరియు రాష్ట్రంలో ఏ హోటల్ లో అయినా రెస్టారెంట్లో అయినా ఒక లీటరు వాటర్ బాటిల్ 20 రూపాయలు ఉంటుంది కానీ బీసీ ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు రోజుకు మెస్ చార్జీలు మూడు ,నాలుగు తరగతి విద్యార్థులకు 38 రూపాయలు 5 నుండి 9వ తరగతి విద్యార్థులకు 48 రూపాయిలు ఇంటర్ మరియు పై తరగతి విద్యార్థులకు 56 రూపాయలు రోజుకు ఇవ్వడం చూస్తా ఉంటే విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఏవిధంగా కపట ప్రేమ చూపుతూందో రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు కావున తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబునాయుడు మానవతా కోణంలో హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు మీ గుండెతోనా, కడుపుతోనా, చెవులతోనా విని తక్షణమే హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు రోజుకు 150 రూపాయలు మరియు కాస్మోటిక్ చార్జీలు నెలకు 500 రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న హాస్టల్స్ లో చాలా హాస్టల్స్ లలో మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని సకాలంలో గుడ్డు,అరటిపండు ఇవ్వడంలేదని అలాగే వార్డెన్స్ హాస్టల్స్ లో ఉన్న పిల్లలకు అందుబాటులో ఉండడంలేదు. అలాగే బీసీ₹బీసీ మరియు ఎస్సీ హాస్టల్లో₹ విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు తక్షణమే పెంచాలి, హాస్టల్స్ లలో సక్రమంగా మెనూ పాటించని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి.

**రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్) జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ ఎస సి హాస్టల్ విద్యార్థులకు తక్షణమే మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కర్నూలు జిల్లా కలెక్టర్ గారికి పబ్లిక్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మహేష్₹ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్య మంత్రివర్యులు ,ఉపముఖ్యమంత్రి వర్యులు, విద్యాశాఖ మంత్రి వర్యులు, బిసి సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎక్కడికెళ్లిన వారు తాగే టి 150 రూపాయలు ఉంటుంది మరియు రాష్ట్రంలో ఏ హోటల్ లో అయినా రెస్టారెంట్లో అయినా ఒక లీటరు వాటర్ బాటిల్ 20 రూపాయలు ఉంటుంది కానీ బీసీ హాస్టల్ విద్యార్థులకు రోజుకు మెస్ చార్జీలు మూడు ,నాలుగు తరగతి విద్యార్థులకు 38 రూపాయలు 5 నుండి 9వ తరగతి విద్యార్థులకు 48 రూపాయిలు ఇంటర్ మరియు పై తరగతి విద్యార్థులకు 56 రూపాయలు రోజుకు ఇవ్వడం చూస్తా ఉంటే విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఏవిధంగా కపట ప్రేమ చూపుతూందో రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు కావున తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు మానవతా కోణంలో హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు మీ గుండెతోనా, కడుపుతోనా, చెవులతోనా విని తక్షణమే హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు రోజుకు 150 రూపాయలు మరియు కాస్మోటిక్ చార్జీలు నెలకు 500 రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న హాస్టల్స్ లో చాలా హాస్టల్స్ లలో మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని సకాలంలో గుడ్డు,అరటిపండు ఇవ్వడంలేదని అలాగే వార్డెన్స్ హాస్టల్స్ లో ఉన్న పిల్లలకు అందుబాటులో ఉండడంలేదు. అలాగే బీసీ స సి హాస్టల్స్ కు శాశ్వత భవనాలు కేటాయించి విద్యార్థుల జీవితాలను కాపాడాలని కోరారు.

## తిరుమలలో టీటీడీ ఈవో విస్తృత తనిఖీలు

**తిరుమల, జూలై 7(మనం న్యూస్):** తిరుమలలో సోమవారం సాయంత్రం టీటీడీ ఈవో జె.శ్యామలరావు విస్తృత తనిఖీలు నిర్వహించారు. శ్రీవారి పుష్కరిణి, బంగారు డాలర్ల విక్రయ కౌంటర్, అగరబత్తి, కొబ్బరికాయలు విక్రయ కౌంటర్లు, పబ్లికేషన్ స్టాళ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. లడ్డూ కౌంటర్, పబ్లికేషన్ స్టాళ్లు, బంగారు డాలర్ల విక్రయ కేంద్రంలో జరుగుతున్న డిజిటల్ పేమెంట్స్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని ప్రాంతాల్లో డిజిటల్ పేమెంట్స్ సజావుగా సాగుతున్నప్పటికీ కొబ్బరికాయల కౌంటర్ వద్ద సిగ్నల్స్ సరిగ్గా లేకపోవడం కారణంగా డిజిటల్ పేమెంట్స్ చేసేందుకు భక్తులు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను అన్వేషించి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఈవో ఆదేశించారు.



ఈ తనిఖీల్లో డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గోవిందరాజ స్వామి ఆలయంలో కవచ ప్రతిష్ట



**తిరుపతి, జూలై 7(మనం న్యూస్):** తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయంలో జరుగుతున్న జ్యేష్ఠాభిషేకంలో రెండో రోజు సోమవారం కవచ ప్రతిష్ట వైభవంగా జరిగింది. జూలై 07వ తేదీ ఆలయంలో ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు శతకల శస్నపనం, మహాశాంతి హోమం చేపట్టారు. అనంతరం ఉదయం 10.00 గంటల నుండి 11.30 గంటల వరకు ఆలయంలోని కల్యాణమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సమర్పణ, ఆరగింపు, అనుగ్రహం, బ్రహ్మోఘోషలను వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి కవచ ప్రతిష్ట చేశారు. సాయంత్రం 5.30 గంటల నుండి 6.30 గంటల వరకు శ్రీ గోవిందరాజస్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుచ్చి వాహనంపై ఆలయ నాలుగు మాఢ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయాల పెద్దజీయర్ స్వామి, చిన జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో కె. ముని కృష్ణారెడ్డి, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకను అభివృద్ధి చేయండి: భాను



**తిరుపతి, జూలై 7(మనం న్యూస్):** తొలి తెలుగు వాగ్గేయకారుడు కారుడు పద కవితా పితామహుడు అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామాన్ని అభివృద్ధి చేయాలని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు మరియు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుకుంట రమేష్ నాయుడు, తాళ్లపాక మాజీ సర్పంచ్ ఉద్దండం బ్రహ్మయ్య కుమారుడు ఉద్దండం సుబ్రహ్మణ్యంలతో టీటీడీ ఈవో జె. శ్యామల రావును సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా తాళ్లపాక ముఖద్వారం నుంచి తాళ్లపాక వరకు రోడ్డును వెడల్పు చేసి వివిధ రకాల కవులు విగ్రహాలను ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, సంగీత నృత్య కళాశాలలు తాళ్లపాక చెరువులో అన్నమయ్య పద కవితలు రాస్తున్నట్లుగా ఒక విగ్రహాన్ని ఏర్పాటు చేసి, తాళ్లపాకలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించి, అన్నమయ్య నివసించిన ఇంటి స్థలాన్ని ఆర్టిఫిషియల్‌గా మళ్లీ ఏర్పాటు చేసి, భక్తుల కోసం వసతి గృహాలు, సుదర్శన్ కౌంటర్‌ను లడ్డు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో టికెట్లను పెంచాలన్నారు.

# 2047 నాటికి దేశంలో అగ్రగామిగా ఏపీ

- ఆంధ్రప్రదేశ్ జీరో పావర్టీ దిశగా అడుగులు వేస్తుంది
- తిరుపతి జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాలి
- జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్

**తిరుపతి, జూలై 7(మనం న్యూస్):** చరిత్రలో ఎన్నడు లేని విధంగా జిల్లా, నియోజకవర్గ విజన్ డెవలప్మెంట్ ప్రణాళికలను రూపొందిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంప్స్ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్ లోని వీడియో సమావేశ మందిరం నందు జిల్లా ఇన్చార్జి మంత్రి అధ్యక్షతన స్వర్ణాంధ్ర విజన్- 2047లో భాగంగా డిస్ట్రిక్ట్ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ (డీవీఏపియు), పి4పై జిల్లాలోని శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర 2047 నాటికి రాష్ట్రాన్ని నం.1గా ఉండేలా రాష్ట్ర ముఖ్యమంత్రి విజన్ డాక్యుమెంట్ కు రూపకల్పన చేశారన్నారు. అలాగే నేడు 2029 సంవత్సరం నాటికి రాష్ట్రాన్ని ఏఐ రంగాల్లో అభివృద్ధి పథంలో నిలపాలో చర్యలు తీసుకునేలా కార్యాచరణను రూపొందించడం జరుగుతోందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జిల్లా, నియోజకవర్గ అభివృద్ధి చేపట్టేందుకు విజన్ ప్లాన్ ను ఎలా తయారు చేస్తున్నామో జిల్లా కలెక్టర్ వివరించడం జరిగిందన్నారు. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి కార్యాలయాన్ని, 5మంది సిబ్బందిని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవా రంగాల్లో అవకాశాలను ఏ విధంగా అందిపుచ్చుకొని ముందుకు వెళ్లాలో జిల్లా నియోజకవర్గ విజన్ ప్రణాళికలలో పొందుపరచడం జరుగుతుందన్నారు. తిరుపతి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో తీసుకెళ్లేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు.




శాసన సభ్యులు సైతం తమ నియోజకవర్గాల్లో ఏ విధంగా అభివృద్ధి చేయాలో ప్రణాళికలు రూపొందించేందుకు అధికారుల సహాయం తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఈ అంశంలో ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లాలో 46% పరిశ్రమల నుండి, 30% సర్వీస్ రంగం నుండి, 18% వ్యవసాయ రంగం ద్వారా ఆదాయం వస్తోందన్నారు. తిరుపతి జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాలన్నారు. పీ4 విధానం ద్వారా పేదలకు సాయం చేస్తూ ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రణాళికలు సిద్దం చేయాలన్నారు. సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన టాప్ 10% మంది అట్టడుగున పేదరికంలో ఉన్న 20% మందితో అనుసంధానం చేసే కార్యక్రమమన్నారు. పేదరికం లేని సమాజాన్ని స్థాపించడమే లక్ష్యంగా పని చేయాలని. పీ4 విధానం ద్వారా రాష్ట్రంలో 2029 నాటికి పేదరికాన్ని రూపుమాపాలని పలువేదికల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి అవగాహన కల్పిస్తున్నారన్నారు. సమావేశం అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. తను తిరుపతిలోని కలెక్టరేట్లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని, గ్రీవెన్స్ రిడ్రస్సల్, గత గ్రీవెన్స్ యొక్క ఏటీఆర్ (యాక్షన్ టేకెన్ రేపోర్ట్స్) పబ్లిక్ పర్సెప్షన్ అంతా చూశానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్ణాంధ్ర 2047 డిస్ట్రిక్ట్ విజన్ యాక్షన్ ప్లాన్ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత పాలకులు వారు చేసిన విధ్వంస పాలన నుంచి పునర్నిర్మించి మంచి పునాదులు వేసి ఈ రాష్ట్రాన్ని కూడా అగ్ర స్థానానికి తీసుకెళ్లాలని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రతి నియోజక వర్గానికి, ప్రతి మండలానికి, ప్రతి సెక్టార్‌కి ఒక కో ఆర్డినేటర్‌ని నియమించి నియోజకవర్గ స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో పర్యవేక్షిస్తూ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు.

### కలెక్టర్ మాట్లాడుతూ..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుపతి జిల్లా జిడిపిలో 3వ స్థానంలో ఉన్నదని, వ్యక్తిగత తలసరి ఆదాయంలో నాలుగో స్థానంలో ఉన్నదన్నారు. మండల స్థాయిలో 31 శాఖలలో 258 ఇండికేటర్స్‌ని గుర్తించడం జరిగిందన్నారు. ఇండికేటర్స్ అభివృద్ధిలో భాగంగా జిల్లా అధికారులను రాష్ట్రస్థాయిలో అనుసంధానం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో నిర్వహించిన పి4 సర్వేలో 80331 బాటమ్ 20% కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించడం జరిగిందన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో 12,497, గూడూరు నియోజకవర్గంలో 14,262 నగరిలో 3092, సత్యవేడులో 12,756, శ్రీకాళహస్తిలో 11,850, సూళ్లూరుపేటలో 12,456, తిరుపతిలో 6,379, వెంకటగిరి నియోజకవర్గంలో 7039, వెరసి 80,331 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులను ప్రోత్సహించమని మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు తెలియజేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లను తమ మండలాలు, పట్టణాల్లో ఎంపీడీవోలను, మునిసిపల్ కమిషనర్లను పర్యవేక్షించి దిగువునవున్న 20% కుటుంబాలను గుర్తించి మార్గదర్శులతో వారిని దత్తత తీసుకొని ప్రోత్సహించేలా చూడాలన్నారు.

ఇప్పటివరకు జిల్లాలో శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, మండలాలకు చెందిన 5 మంది మార్గదర్శులు 1911 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారని, సంబంధిత ఎంపీడీవోలను, మార్గదర్శులను బంగారు కుటుంబాలతో అనుసంధానించమన్నారు. ఈ సందర్భంగా వెబ్సైట్ నందు ఏ విధంగా బంగారు కుటుంబాలను దత్తత చేసుకోవాలో తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభ్యులకు వివరించారు.

స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అందులో భాగంగా 10 మార్గదర్శక సూత్రాలను నిర్దేశించడం జరిగిందని తెలిపారు. జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌లో భాగంగా సచివాలయ సిబ్బందిని ఐదుగురిని నియమించడం జరిగిందని, ఆ ఐదుగురిని అగ్రికల్చర్, ఆక్వా, ఇండస్ట్రీ సెక్టర్, పబ్లిక్ ఇంటర్ఫేస్‌కి కో ఆర్డినేటర్స్‌గా నియమించడం జరిగిందని తెలిపారు. మన రాష్ట్రంలో అత్యధికంగా జిడిపి లైవ్ స్టాక్ ద్వారా సమకూరు తోందన్నారు. పరిశ్రమలను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోట్ చేస్తున్నారని, ఈ సెక్టార్ కోసం ఒక కోఆర్డినేటర్‌ను నియమించామన్నారు.

రాష్ట్రంలో సర్వీస్ సెక్టార్ ద్వారా సుమారుగా 42% జిడిపి అందుతోందన్నారు.పబ్లిక్ ఇంటర్ఫేస్‌కి ప్రాధాన్యత దిశగా ఒక కో ఆర్డినేటర్ నియమించడం జరిగిందన్నారు. తర్వాత ఎమ్మెల్యేలు జిల్లా అధికారులు మాట్లాడుతూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌లో తమ వంతు బాధ్యతగా నిర్వర్తించి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల అభివృద్ధిలో పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య, శిక్షణ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, సూళ్లూరు పేట, వెంకటగిరి ఎమ్మెల్యేలు ఎన్.విజయశ్రీ, కె.రామకృష్ణ, ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీల రిజిస్ట్రార్లు ప్రొఫెసర్, వీఎం భూపతి నాయుడు, ప్రొఫెసర్ ఎన్. రజని, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు డీఆర్ఓ నరసింహులు, జిల్లా అధికారులు ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కపిలేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు



**తిరుపతి, జూలై 7(మనం న్యూస్):** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలలో భాగంగా జూలై 7వ తేదీ సోమవారం ఉదయం నుండి శాస్రోక్తంగా కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, అభిషేకం, అలంకారం, అర్చన, నివేదన చేపట్టారు. ఉదయం 09 గంటల నుండి 10 గంటల వరకు పంచమూర్తుల ఉచ్చవర్లకు స్నపన తిరుమంజనం, అలంకారం నిర్వహించారు. సాయంత్రం కలశ స్థాపనం, కలశ పూజ, అగ్ని కార్యం, హోమం, లఘు పూర్ణాహూతి, గ్రంధి పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు.

# అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

- సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

**చిత్తూరు, జూలై 7(మనం న్యూస్):** ఏడాది కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని, ఏపీ బ్రాండ్‌కు పునర్ వైభవం తిరిగి వస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని అంతః పాతాళానికి నెట్టేసి.. ఏపీ బ్రాండ్ ఇమేజ్ ని నాశనం చేసిందన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే గుడిపాల మండలంలోని నారగల్లు, ఏఎల్ పురం, వెంగమాంబ పురం, 197 రామాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన విజయాలు, సూపర్ సిక్స్ పథకాల అమలు, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను ప్రతి ఇంటికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమాన్ని వివరిస్తూనే... ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు.



తల్లికి వందనం నిధులు అందాయా? దీపం 2.0 ఉచిత గ్యాస్ సిలిండర్ అందుతోందా? నీటి సరఫరా సక్రమంగా జరుగుతోందా ఆరా తీశారు. ఏడాది కాలంలోనే గ్రామాల్లో సిమెంట్ రోడ్లు కాలువలో నిర్మించామని, రాబోయే నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కొత్తపల్లి హెచ్ డబ్ల్యులో అంగన్వాడీ కేంద్రానికి బీరువా కావాలని విద్యార్థులు అడుగగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా నారగల్లు పంచాయతీలో శ్రీ వేల్మురుగన్ స్వామి ఆలయంలో పూజల నిర్వహించారు. కార్యక్రమంలో చిత్తూరు నగర మేయర్ ఎస్ అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మండల తెదేపా నాయకులు సుబ్బానాయుడు, అనిల్, బాలాజీ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, గ్రామ పంచాయతీ కమిటీ సభ్యులు, ఉమ్మడి పార్టీల నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 వినతులు

- ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తాం: అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి

**తిరుపతి, జూలై 7(మనం న్యూస్):** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 35 వినతులు వచ్చాయని అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 11 మంది తమ సమస్యలు తెలుపగా, 24 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. సుభాష్ నగర్ లో కాలువలు, రోడ్లు ఏర్పాటు చేయాలని, ఎస్.ఎల్.వి నగర్ నందు నీటి సౌకర్యం కల్పించాలని, గొల్లవాని గుంట ఆయిల్ మిల్లు రోడ్డు వద్ద రోడ్లు, కాలువలు



ఏర్పాటు చేయాలని, పెద్దకాపు వీధి భజన గుడి వద్ద బోర్ పైప్ మరమ్మత్తులు చేయించాలని, సంజయ్ గాంధీ కాలని భజన గురి వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని, సిరిగిరి టవర్స్ వద్ద అక్రమ నిర్మాణం అడ్డుకోవాలని, కపిలతీర్థం నుండి శ్రీనివాస సేతు వెళ్ళే మార్గంలో సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని, శివజ్యోతి నగర్ ఎస్.బి.ఐ వద్ద నీరు ఎక్కువ నిలుస్తున్నాయి పరిష్కరించాలని, యుడిఎస్ మరమ్మతులు చేయాలని కోరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ ఖాన్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, డి.ఈ.లు, ఏసిపి లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

- కార్మికులు, కర్షకులను కార్పొరేట్లకు బానిసలను చేసే విధానాలను వ్యతిరేకించండి.
- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ పిలుపు

**తిరుపతి, జూలై 7(మనం న్యూస్):** జూలై 9వ తారీఖున దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్ టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయపనేని హరికృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం నారాయణపురంలోని ఐఎఫ్టీయు కార్యాలయంలో సమ్మె గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాయపనేని హరికృష్ణ మాట్లాడుతూ రైతు, కార్మిక వ్యతిరేఖవిధానాలతో కేంద్రంలోని బాజాపా ప్రభుత్వం అణచివేత ధోరణి అవలంభిస్తోందన్నారు. నాలుగు లేబర్ కోర్టులను రద్దు చేయాలని, నూతన వ్యవసాయమార్కెటింగ్ చట్టాన్ని ఉపసంహరించాలని, కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో కార్మిక, ఉద్యోగ, రైతులు చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయడం జరుగుతోందని చెప్పారు. సమ్మె ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామిశెట్టి వెంకయ్య మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్, పెట్టుబడిదారులకు రైతులను, కార్మికులను బానిసలుగా చేసే దుర్మార్గపు చర్యలకు కేంద్ర పాల్పడుతోందని దీనికి వ్యతిరేకంగా జరిగే సమ్మెలో రైతులు భాగస్వామ్యం కావాలని కోరారు.




ఐఎఫ్టీయూ నగర కన్వీనర్ లోకేష్ మాట్లాడుతూ 9వ తేదీ ఉదయం 9.30 గంటలకు అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఎఐటీయూసీ ఆధ్వర్యంలో జరుగుతున్న ర్యాలీలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకే ఎం ఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు పి. వెంకటరత్నం, పీ ఓడబ్ల్యు జిల్లా కన్వీనర్ అరుణ, అంగన్ వాడీ వర్కర్స్ ఫెడరేషన్ నగర అధ్యక్షురాలు సుజాత, నాయకురాలు గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా సమస్యల పరిష్కార వేదికకు 284 అర్జీలు

- పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి ఆర్జీకి మొదట ప్రాధాన్యత ఇవ్వాలి
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్
- ప్రతి అర్జీకి గడువులోపు పరిష్కారం చూపాలి
- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి కలెక్టరేట్, జూలై 7(మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఆలస్యం చేయకుండా నాణ్యతతో పరిష్కారం చూపి మానవతా దృక్పథంతో వ్యవహరించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ కలసి సంయుక్తంగా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయములో జిల్లా అధికారులతో కలిసి జిల్లా మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు దగ్గర నుండి వారియొక్క సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ క్రమంలో వచ్చిన కొన్ని సమస్యలపై మంత్రి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓలు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతూ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని, పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్క రించాలని జిల్లా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా కలెక్టర్ కలసి సంయుక్తంగా జిల్లా అధికారులను ఆదే శించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, రెవెన్యూ అధికారి జి. నరసింహులు, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధా రాణి, రోజ్ మాండ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.



## ఉండిపోవచ్చు కదా..!

నాలా నేను లేనప్పుడు
నీలో నన్ను దాచుకున్నావు
నీలో నేనున్నానని తెలిసేలోపు

నా కనుచూపుకు సైతం చిక్కకుండా
నా మదిని చిక్కుల్లో పెట్టేసావు
రోజంతా ప్రతి పనిలోనూ

నీ జ్ఞాపకాలే... గడియ గడియలో
నీ తలంపులే... పంచుకోలేను
తెంచుకొని బయటికి రాలేను

తప్పుకుందామంటే మనసొప్పుకోవడం లేదు
నిదురలోనూ నీ రూపు కానరాక
ఒకటే వెతుకులాట నీ మాట వినబడక
రావని తెలుసు వచ్చిందా నాపై విసుగు

వుండిపోవచ్చు కదా..! చితిలోనూ తోడొస్తా
ఊపిరాడనివ్వని నీ గురుతుల సాక్షిగా ...
ఊహకందని నీపై నాకున్న ప్రేమ సాక్షిగా..

- వాసి జ్యోత్స్న
9866843005

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

## మద్దతు ఉండి ఏం లాభం

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్ చేరిక ఊరిస్తోంది. భారత్ ప్రధాని మోదీ ఏ దేశ పర్యటనకు వెళ్ళినా భారత్ కు భద్రతా మండలిలో శాశ్వత సభ్య స్థానం ఉండాల్సిందే అని ఆయా దేశాలు నొక్కి చెప్పడం గమనార్హం. మోదీ ఇటీవల బ్రిక్స్ సమావేశానికి వెళ్ళినప్పుడు ఐక్యరాజ్య సమితిలో భారత్ కు శాశ్వత సభ్య స్థానం ప్రస్తావించారు. శాశ్వత స్థానం భారత్ పొందిన కొన్ని రాజకీయ కారణాల వల్ల కొన్ని దేశాలు అడ్డుపడుతున్నాయి అనేది నగ్న సత్యం. ముఖ్యంగా చైనా, పాక్ దేశాలకు భారత్ భద్రతా మండలిలో చేరడం సుతరాము ఇష్టం లేదు. పాక్, చైనా రాజకీయాల వలన భారత్ చేరిక ఉండటం లేదు. ఒక దశలో అమెరికా కూడా భారత్ చేరిక పై అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి.ఆసియా ఖండంలో భారత్ చేరితే చైనా 'ప్రభ'తగ్గుముఖం పట్టడం ఖాయం. ముందు పాక్ కు ఎట్టి పరిస్థితి లోను ఒప్పుకోదు. పాక్ భద్రతమండలిలో శాశ్వత సభ్య దేశం కాకున్నా భారత్ చేరికను చైనాతో లేక అమెరికాతో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తుంది. భారత్ ను దైర్యంగా ఎదుర్కొనే సాహసం చేయక శిఖరాగ్ర సమావేశాలలో భారత్ ను దోషిగా చూపెట్టి తను లాభ పడాలని చూసి భంగ పడినా తన వైఖరి మార్చుకోవడం లేదు.

భారత్ ప్రధాని సందర్శించి న పలు దేశాలలో భద్రతా మండలిలో భారత్‌కు మా మద్దతు ఉంటుందని చెప్పినా ప్రయోజనం శూన్యం. రష్యా, ఫ్రాన్స్ దేశాలు భారత్ కు మద్దతు తెలిపినా చైనా వీటో చేస్తుంది. అమెరికా బ్రిటన్ దేశాలు చైనా ఆ పని చేస్తుందని తెలిసి మౌనంగా ఉంటాయి. రాజకీయం అంటే అదే. విశ్వంలో భారత్‌కు ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలిలో పాక్, చైనా తప్పితే దాదాపు ప్రతి దేశం భద్రతా మండలిలో స్థానం ఉండాల్సిందే అని చెప్పినా ఆ దిశలో చర్యలు లేవు. ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలిలో అమెరికా పెత్త నం ఉంది. ఎందుకంటే సమితికి భారీ నిధులు ఒక్క అమెరికానుంచే అందుతున్నాయి. ఆరవ శాశ్వత సభ్య దేశం చేరాలంటే ముందు ఆయా దేశాల కున్న 'వీటో' పవర్ రద్దు చేయాలి. 'వీటో' పవర్ ఎట్టి పరిస్థితులలోనూ రద్దు కాదు. ఎన్నో సంస్కరణల తో అమెరికాను నడిపిస్తున్న ట్రంప్ భద్రతా మండలిలో ఆరో దేశంగా భారత్ ను చేర్చు కోవాలి. ఏ తీర్మానం చేయకనే అమెరికా, భారత్ ను ఆహ్వానించాలి. భారత్ తో పాటు జర్మనీ, దక్షిణ ఆఫ్రికా, బ్రెజిల్ మొదలగు దేశాలు కూడా ముందు వరుసలో ఉన్నాయి. ఒకవేళ భారత్ చేరకుండా మిగతా దేశాలు చేరితే మాత్రం భద్రతా మండలికి అంత హంగు ఉండదు. భారత్ చేరితేనే సమితికి కళ. భారత్ అతి త్వరలో భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశంగా చేరుతుందని ఆశీద్దాం.

- కనుమ ఎల్లారెడ్డి
93915 23027

## స్కూల్ సమావేశాల్లో ఇతరుల జోక్యం తగదు

జులై 10 తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని స్కూళ్ళలో జరుగబోవు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కొరకు లీప్ యాప్ నందు విట్నెస్ రిజిస్ట్రేషన్ అన్ని స్కూల్స్ నందు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. విట్నెస్‌గా విద్యాశాఖలో పని చేస్తున్న ఉద్యోగులు కాకుండా వేరే ఏదో ఒక డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగిని రిజిస్ట్రేషన్ చెయ్యాలని చెబుతున్నారు. ఈ విట్నెస్‌గా ఉన్న వ్యక్తి సమావేశం రోజున 30 సెకండ్ల వీడియో మరియు 4 ఫోటోలను అప్లోడ్ చెయ్యాల్సి ఉంటుంది. స్కూళ్ల నందు జరిగే తల్లి దండ్రుల ఉపాధ్యాయుల సమావేశాలలో స్కూళ్ళ లో వేరే డిపార్ట్‌మెంట్ వారి జోక్యం తగదు. దీనికి స్కూళ్లలోని టీచర్లనే వాడాలి. దీన్ని పూర్తిగా ప్రభుత్వం విరమించుకోవాలి. ఇతర డిపార్ట్‌మెంట్ వారి జోక్యం లేకుండా సమావేశాలు నిర్వహించాలి.

- వాసిలి సురేష్
9494615360

# విధ్వంసం అభివృద్ధికి విఘాతం



ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఒక చోట ఏవో అలజడులు చెలరేగుతూనే ఉన్నాయి. మానవ రుధిరం ఏరులై ప్రవహిస్తూనే ఉంది. మతం పేరుతోనో,ప్రాంతం పేరుతోనో మారణకాండ విశృంఖల విహారం చేస్తూనే ఉంది. ఒక వైపు ఉక్రెయిన్,రష్యా యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. ఇజ్రాయిల్, హమాస్ దాడులు గాజును రక్తం సిక్తం చేసాయి. పాక్ ప్రేరణతో భారత్ లో సీమాంతర ఉగ్రవాదం ప్రబలింది. ఇటీవల పహల్గాం లో అమాయకులను ఉగ్రవాదులు అత్యంత దారుణంగా కాల్చిచంపడంతో భారత్- పాక్ ల మధ్య తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మనుషుల ప్రాణం తీసే మానసిక ఉన్మాదం పతాక స్థాయికి చేరింది. ఇతర దేశాలను నరమేథంతో దారికి తెచ్చుకోవాలనే పరాకాష్ఠకు చేరిన పైశాచిక అకృత్యాన్ని 'ఉగ్రవాదం' గా పేర్కొనవచ్చు. ఉగ్రవాదం ఆధునిక కాలంలో కొనసాగుతున్న అత్యంత క్రూరమైన ఆటవిక చర్య. ఉగ్రవాదం భారతదేశానికి ఒక విషమ సమస్యగా మారింది. స్వాతంత్ర్యానికి ముందు,తర్వాత కూడా భారతదేశం అనేక రూపాల్లో కొనసాగుతున్న ఉగ్రవాదం వలన నష్టపోతూనే ఉంది. దేశ విభజన సమయంలోనే మనం అనేక విధాలుగా నష్టపోయాం. ఇప్పుడు కూడా ఉగ్రవాదం రూపంలో పరాయి మూకలు దేశాన్ని కబళించాలని చూస్తున్నాయి.ఇతరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గుర్తించి గౌరవించిన దేశానికి నేటికీ కష్టాలు తప్పలేదు.బంగ్లా విమోచన కోసం పోరాడినా, లంకేయుల దేశ సమగ్రత కోసం శ్రీలంకకు శాంతి సైన్యాన్ని పంపించి కాపాడినా భారత దేశానికి శత్రు భాధలు తప్పలేదు చేదు ఫలితాలను చవిచూస్తున్నాం.పొరుగు దేశాల్లోని ఉగ్రవాదుల పంజాకు భారతదేశం మూల్యం చెల్లించుకోవడం ఇంకా కొనసాగుతూనే ఉన్నది.ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అదొక అనాగరిక,అమానుష ప్రక్రియ గానే భావించాలి. అమాయప్రజల రుధిరంతో తడిసిన కర్కశమూకల వికృత ఆగడాలకు అడ్డాగా మారిన ఉగ్రవాద సంస్థలకు ఊతమిచ్చే ఏ దేశమైనా తమ పాపకృత్యాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. రాయబారాలతో,ఒప్పందాలతో రాజీ పడని మనస్తత్వాలకు దండోపాయమే శరణ్యమన్న సూత్రం ఇటీవల భారత్ జరిపిన ఆపరేషన్ సందూర్ నిరూపించింది. ఉగ్రవాద శిబిరాల ధ్వంసం ఉరిమురిమి చూసే ఉగ్రదేశమైన పాకిస్థాన్‌కు ముచ్చెమటలు పట్టించింది. ప్రపంచమంతా ఉగ్రవాదాన్ని అసహ్యించుకుంటున్నా 'నవ్విపోదురు గాని నాకేటి సిగ్గు' అనే రీతిలో పాక్ బరితెగించింది.పాక్ ప్రభుత్వం,మిలటరీ ఉగ్రవాదులకు అండగా నిలబడడం దౌర్భాగ్యం. ఉగ్రవాదుల పీడ వదిలించుకోలేని పాక్ ఆర్థికంగా పతనావస్థకు చేరింది. పాక్‌లో అంతర్గత సంక్షోభం విభజన దశకు చేరుకుంది. తన ఇంటిని చక్కదిద్దుకోలేని పాక్ భారత్ ను నాశనం చేయాలను కోవడం దుర్మార్గమైన చర్య. వ్యక్తులను,వ్యవస్థలను నిర్వీర్యం చేసి,ఆర్థిక మూలాలను ధ్వంసం చేయడమే కాకుండా అమాయక ప్రజల ప్రాణాలను అలవోకగా బలితీసుకుంటూ, నిరంతరం అశాంతిని ప్రజ్వలింపచేస్తూ ఆయా దేశాలను ఆక్రమించుకోవడమో, తమ కనుసన్నల్లో మసలుకునేటట్టు చేయడమో కొన్ని దేశాలకు నిత్యకృత్యంలా మారింది. మానవత్వం నశించిన కరడు గట్టిన పైశాచిక వాదులను సమూహాలుగా ఏర్పాటు చేసి, ఇతర దేశాల్లోమారణహోమం సృష్టించడమే ధ్యేయంగా ఏర్పాటయిన విధ్యంసకారక సంస్థలే ఉగ్రవాద సంస్థలు.ఇతర దేశాల భూభాగాలను ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో అశాంతిని సృష్టించే సామ్రాజ్యవాద శక్తులు ఒకవైపు,అకారణ కలహాలతో నిరంతరం ప్రజల ప్రాణాలను బలితీసుకుంటూ ఏదో సాధించాలన్న తపనతో మానవత్వాన్ని మంటగలిపి,ఆ మంటల్లో చలికాసుకునే పైశాచికత్వం మరోవైపు ప్రపంచంలో ప్రబలిపోతుండడం విచారకరం. మానవత్వపు ఛాయలు విచ్ఛిన్నకారుల మనస్సుల్లో



మచ్చుకైనా కానరావు. కరడు గట్టిన రాక్షసత్వమే నైజంగా బ్రతికే ఉగ్రవాదులను విప్లవకారులుగా,సంస్కర్తలుగా కీర్తించే దేశాలను,ఉగ్రమూకలకు వత్తాసు పలుకుతూ, వారు సాగించే ఘోర హింసాకాండకు ఆర్థికంగా, నైతికంగా సహకరించే దేశాల అనైతిక పోకడలను వర్ణింపతరం కాదు. మతమౌఢ్యవాదంతోనో, సామ్రాజ్యవాదంతోనో, స్వేచ్ఛ పేరుతోనో అమాయకుల కుత్తుకలను ఖండించే దుశ్చర్యలకు పాల్పడే కర్కశవాదం నుండి పుట్టిన ఉగ్రవాదాన్ని కూకటి వ్రేళ్ళతే పెకలించాయి.చాలామంది ఉగ్రవాదులకు తాము సాగిస్తున్న మారణ కాండకు సంబంధించి సహేతుకమైన కారణం కనిపించదు.కొంతమంది ప్రోద్భలంతోనో,వారిచేత ప్రేరేపించబడిన తీవ్రమైన మానసిక భావజాలంతోనో ఉగ్రవాదులుగా మారిన వారు కొందరైతే...ఉగ్రవాద శిబిరాలను నడుపుతూ ఇతర దేశాల నుండి అందుతున్న డబ్బు సంచులకు మోజుపడి స్వార్థ పూరితమైన లక్ష్యాలతో ఉగ్రవాదులను పెంచి పోషించే వారు మరికొందరు ప్రపంచాన్ని అశాంతికి గురిచేస్తున్నారు. ఉగ్రవాదం కూడా కొంతమందికి ఉపాధినిచ్చే ముడిసరుకుగా మారడం అత్యంతహేయం, అమానవీయం.అశాంతిని సృష్టించడం వలన సాధించేదేమీ ఉండదన్న నగ్నసత్యం ఇప్పటి వరకూ జరిగిన మొదటి,రెండవ ప్రపంచ యుద్ధ ఫలితాలు నిరూపించాయి.అమాయకుల ప్రాణాలు బలికావడం తప్ప ఉగ్రవాదుల దుశ్చర్యల వలన ఒనగూడే ప్రయోజనం శూన్యమని ప్రపంచంలో అనేక విధ్వంసాలు సృష్టించి తెరమరుగైన ఉగ్రవాద సంస్థల దృష్టాంతాలను గమనించాలి.భారత దేశం శాంతి కాముక దేశం. ఈ శాంతి వచనాల వల్ల ఇప్పటికే దేశం ఎంతో కోల్పోయింది. భవిష్యత్తులో మన దేశం ఇలాంటి శాంతి వచనాలు వల్లించడానికి సంసిద్ధంగా లేదు. వ్యూహానికి ప్రతివ్యూహం...దెబ్బకు ఎదురుదెబ్బ అన్నట్టుగా ముందుకు సాగితేనే శత్రుదేశాలు దారిలోకి వస్తాయి. ఐక్యరాజ్య సమితి కూడా ఉగ్రవాదం వలన భారత్ ఎదుర్కొంటున్న సమస్యల పట్ల మొసలి కన్నీరు కార్చిందే తప్ప పాకిస్తాన్ పట్ల కఠిన వైఖరి తీసుకోలేకపోయింది. ద్వైపాక్షిక ఒప్పందాలతో సమస్యలను పరిష్కరించుకోవాలని చాలా దేశాలు నెచ్చచెప్పడం జరిగింది. మన దేశం కూడా ఎన్నో సార్లు పాక్ తో ద్వైపాక్షిక ఒప్పందాలకు సిద్ధమైంది. అయితే పాక్ తో కుదుర్చుకున్న ప్రతీ ఒప్పందాన్ని పాక్ పాలకులు తుంగలో తొక్కి విధ్వంస రచనకు తెరతీసారు. జుల్ఫికర్ ఆలీ భుట్టో నుండి జియా-ఉల్- వరకు, ముషారఫ్ నుండి నవాజ్ షరీఫ్ వరకు భారత్ లో హింస రచనకే అగ్రతాంబూలమిచ్చారు.

1971వ సంవత్సరంలో భారత్ - పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధం వలన పాకిస్తాన్ నుండి తూర్పు పాకిస్తాన్ విడివడి బంగ్లాదేశ్ గా అవతరించింది. ఈ యుద్ధంలో ఘోరపరాజయం పొందిన పాకిస్తాన్ భారత్‌తో సిమ్లా ఒడంబడిక చేసుకున్నది.ఈ ఒడంబడిక ద్వారా ఇరుదేశాల విషయంలో మూడో దేశం మధ్యవర్తిత్వం వహించరాదు. అయినప్పటికీ పాక్ ప్రతీ సమస్యకూ ఐక్యరాజ్య సమితి, ఇతర దేశాల మధ్య వర్తిత్వానికి ప్రాకులాడడం,సరిహద్దుల్లో కాల్పులకు తెగబడడం,సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడడం సిమ్లా ఒడంబడికకు విరుద్ధమే. కార్గిల్‌లో చొరబాట్లకు పాల్పడి,చావు దెబ్బ తిన్న పాక్ ఇంకా గుణపాఠం నేర్చుకోలేదు. లాల్ బహదూర్ శాస్త్రి,ఇందిరా గాంధీ, వాజ్‌పేయి, మోడీ వంటి భారతీయ ప్రధానులు పాకిస్థాన్‌కు దీటైన సమాధానం చెప్పారు. అయినప్పటికీ సరిహద్దుల్లో పాక్ ఆగడాలు ఆగడం లేదు. పుల్వామా,పఠాన్ కోట్,యూరి వంటి, పహల్గాం వంటి సంఘటనలపై స్పందించిన ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 'సర్జికల్ స్ట్రయిక్స్' ద్వారా, ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్ కు గట్టిగా గుణపాఠం నేర్పింది. అయినప్పటికీ పాక్ వైఖరిలో మార్పు రావడం లేదు.ఉగ్రవాదం వలన భారత్ తన అపారమైన వనరులను అభివృద్ధికి వెచ్చించలేకపోతున్నది. రక్షణ రంగానికి అధిక నిధులను కేటాయించవలసి వస్తున్నది. ఉగ్రవాదులకు ఊతమిస్తున్న పాక్ ఆర్థికంగా పీకల్లోతు కష్టాల్లోకి నెట్టబడింది. పాకిస్తాన్ భవితవ్యమే అగమ్యగోచరంగా మారింది. పాక్ ప్రజలు కూడా పాక్ ప్రేరిత ఉగ్రవాదం పట్ల అసహనంగా ఉన్నమాట వాస్తవం. పాక్ ప్రభుత్వ విధానాల వల్ల అక్కడ ప్రజల్లో తిరుగుబాటు చెలరేగి చీలిక ఏర్పడింది. ఇప్పటికైనా పాకిస్తాన్ బుద్ధి తెచ్చుకుని, ఉగ్రవాదానికి స్వస్తి వాక్యం పలకాలి. 'ఉగ్రవాదం' ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అంతర్జాతీయ సమస్య. ముఖ్యంగా పాక్ ప్రేరిత ఉగ్రవాదం భారత దేశానికి తీవ్రనష్టం కలిగిస్తున్నది. ఐక్యరాజ్య సమితి, ఇతర అగ్రరాజ్యాలు వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని పాక్ ఆగడాలను అరికట్టి, ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి? భారత దేశం లో జన్మించిన ప్రతీ ఒక్కరూ శాంతి కాముకలే...ఉగ్రవాదానికి వ్యతిరేకులే. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతీయ యువత నిరంతరం పోరాడాలి. యువత భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే దేశంలో శాంతి సుస్థిరతలు వెల్లివిరియాలి. అభివృద్ధి పునాదులను పెకలించే ఉగ్రవాదాన్ని కూకటి వ్రేళ్ళతో పెకలించాలి.ఉగ్రవాదం ఆధునిక సమాజంలో పరమజుగుప్సాకరమైన,అత్యంత క్రూరమైన ఆటవిక ప్రక్రియ. ప్రపంచమంతా ఈ హేయమైన ఉగ్రవాద దుశ్చర్యలను ఏవగించుకుంటుంటే ఇంకా ఇలాంటి ఆటవిక చర్యలను ప్రేరేపిస్తూ ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తూ తమ పబ్బం గడుపుకుంటున్న పాక్ లాంటి దేశాలపై ఆర్థిక పరమైన ఆంక్షలు విధించాలి. ఉగ్రవాదాన్ని ఉపేక్షించడం తగదు. ఈ దారుణ పైశాచిక అకృత్యా లను అరికట్టాలి. అప్పుడే భారత దేశం లాంటి దేశాలు పురోగామి పథంలో పయనిస్తాయి. దావూద్ ఇబ్రహీం, మసూద్ అజహర్,బిన్ లాడెన్ లాంటి ఉగ్రవాదనాయకుల కర్కశ వ్యూహాలకు భారతదేశంలో ఎంతోమంది అమాయక ప్రజలు,సైనికులు తమ ప్రాణాలను కోల్పోయారు. బింద్రన్ వాలే చంపబడినా అతని ఉగ్ర ప్రేరణ సజీవమై ఇందిరాగాంధీని అంతమొందించింది. ప్రభాకరన్ వంటివారి దుశ్చర్యలకు రాజీవ్ గాంధీ లాంటి నాయకాగ్రగణ్యులు బలై పోయారు. ఎంతో మంది భారతీయ ముద్దుబిడ్డలు ఈ దేశ సమైక్యత కోసం బలిదానం గావించబడ్డారు. వారి రక్తతర్పణం వృథాగా పోలేదు. చనిపోయిన వీరుల త్యాగ ఫలం వలనే భారత దేశం సమైక్యంగా మనగలుగుతున్నది. భారత ప్రభుత్వం రాజీవ్ గాంధీ ప్రాణత్యాగం చేసిన మే 21 వ తేదీని ప్రతీ ఏటా 'జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం' గా పాటిస్తూ ఉగ్రవాదంపై అలుపెరుగని పోరు సాగిస్తున్నది.

- సుంకవల్లి సత్తిరాజు
9704903463

# ఏది సత్యం? ఏదసత్యం!?



'జంగ్ ఔర్ మొహబ్బత్ మే సబ్ జాయజ్ హోతా హై' అనేది ఒక హిందీ సామెత. అంటే దీనర్థం యుద్ధం, ప్రేమలో ప్రతీది సమంజసమే. దీన్ని నరనరాన ఒంటబట్టించుకున్న ఇండియా, పాకిస్తాన్‌కు చెందిన మీడియా చానళ్లు.. యుద్ధ సమయంలో ఇష్టానుసారంగా వ్యవహరించాయి. సమాజం పట్ల తమకు సైతం ఒక నైతిక బాధ్యత ఉంటుందని మరిచి.. ఫేక్ న్యూస్‌ను ప్రసారం చేశాయి. సోషల్ మీడియాలోనూ జోరుగా అసత్య ప్రచారం వైరల్ అయింది. దీంతో ప్రజల్లో భయాందోళనలు, మానసిక ఒత్తిడి రెకెత్తింది. అయితే ఇండియాలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్, ఆల్ట్ న్యూస్, పాకిస్తాన్ లో మీడియా మ్యాటర్స్ ఫర్ డెమొక్రసీ వంటి సంస్థలు ఫ్యాక్ట్ చెక్ చేసి అనేక అసత్య ప్రచారాలను ప్రజల ముందుకు తెచ్చాయి. ఆ తర్వాత కొన్ని చానళ్లు క్షమాపణలు కోరినా.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రెండు దేశాల మీడియా చానళ్లపై ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయత తగ్గిపోయింది. మరోవైపు ఆయా దేశాల ప్రజలకు మీడియా వ్యవహరిస్తున్న తీరు తెలిసొచ్చింది.




భారత్, పాకిస్తాన్ కు చెందిన న్యూస్ చానళ్లు, సోషల్ మీడియా అకౌంట్లు యుద్ధ సమయంలో చేసిన అనేక క్లెయిమ్స్ ఫేక్ అని ఆ తర్వాత నిర్ధారించబడ్డాయి. భారత రాఫెల్ యుద్ధ విమానం బహవల్పూర్ సమీపంలో కూల్చివేశారని, భారత సైనిక స్థావరంపై దాడి జరిగిందని పాకిస్తాన్ కు చెందిన కొన్ని చానళ్లు, సోషల్ మీడియా ఖాతాలు క్లెయిమ్ చేశాయి. అయితే ఆ వీడియోలు, చిత్రాలు 2021లో పంజాబ్లో జరిగిన మిగ్-21 క్రాష్, 2024లో మహారాష్ట్రలో సుఖోయ్-30 క్రాష్కు సంబంధించినవిగా తేలింది. పాకిస్తాన్లోని నన్కానా సాహిబ్ గురుద్వారాపై డ్రోన్ దాడి జరిగిందని జరిగిన ప్రచారాన్ని సైతం పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఖండించింది. 2020లో లెబనాన్లోని బీరుట్ పేలుడు పుటేజీని భారత్పై మిస్సైల్ దాడిగా పాకిస్తాన్ మీడియా చిత్రీకరించింది. మరోవైపు కరాచీ పోర్టుపై భారత నావికాదళం దాడి చేసిందని ఆజ్ తక్ చానల్ తప్పుడు వార్తను ప్రసారం చేసింది. ఆ తర్వాత అది ఫేక్ అని తేలింది. రెండు జేఎఫ్-17 జెట్ లు కోల్పోయామని పాకిస్తాన్ సైనిక అధికారి ఒప్పుకున్నట్లు ఒక ఏఐ జనరేటెడ్ డీప్ ఫేక్ వీడియోను ఒకరు పోస్టు చేయగా, దాన్ని ఏడు లక్షల సార్లు షేర్ చేశారు. అయితే ఆ తర్వాత అది నకిలీదని గుర్తించారు. అంతేకాకుండా ఇస్లామాబాద్ ను భారత సైన్యం స్వాధీనం చేసుకున్నదని, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బంకర్ లో దాక్కున్నారని, భారత్ కు లొంగిపోయారని, పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ రాజీనామా చేశారని, ఆయనను అరెస్ట్ చేశారని, పాకిస్తాన్ సైనికులను భారత్ ఖైదీలుగా చేసుకున్నదని ఇండియన్ మీడియా ఊదరగొట్టింది. అయితే ఇవన్నీ అసత్యాలేనని తర్వాత తేలింది. తప్పుడు, అసత్య ప్రచారాలను ప్రజల ముందుకు తేవడానికి ఫ్యాక్ట్ చెకింగ్ తప్పనిసరిగా మారింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత.. భారత ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ధ్వంసమైందని, భారత పైలట్ శివానీ సింగ్ను పాకిస్తాన్ అదుపులోకి తీసుకున్నదని, ఇలాంటి 60కి పైగా జరిగిన అసత్య క్లెయిమ్ లను పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఖండించి వాస్తవాలను ప్రజల ముందుంచింది. పాకిస్తానీ జర్నలిస్టులు పాత ఘటనలను సంబంధించిన చిత్రాలను షేర్ చేస్తున్నట్లు ఆల్ట్ న్యూస్ సహ-స్థాపకుడు ప్రతీక్ సిన్హా గుర్తించి ప్రజల ముందుకు తెచ్చారు. పాకిస్తాన్లోని మీడియా మ్యాటర్స్ ఫర్ డెమొక్రసీ సంస్థ అక్కడి స్థానిక మీడియా సంస్థలు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని గుర్తించి రివర్స్ ఇమేజ్ సెర్చ్ ద్వారా ఫ్యాక్ట్ చెక్ చేసి వాస్తవాలను ప్రజల ముందుకు తెచ్చింది.

ఇండియాకు చెందిన కొన్ని న్యూస్ చానల్స్ లైవ్ రిపోర్టింగ్ చేస్తున్నట్లు నటించాయి. ఫలానా చోటి నుంచి సైనికులు బయలుదేరారని, ఎయిర్ క్రాఫ్ట్ లు బయలుదేరాయని చెప్పాయి. దీని ద్వారా జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. మరోవైపు భారత్లో 70% విద్యుత్ గ్రిడ్ సైబర్ దాడి వల్ల కుప్పకూలిందని, పాకిస్తాన్ మిస్సైల్ దాడులు చేసిందని వంటి కొన్ని తప్పుడు క్లెయిమ్ లు ప్రజల్లో భయాందోళనలను రేకెత్తించాయి. అసత్య సమాచారం వల్ల ప్రజల్లో ఆందోళన, భయం, ఒత్తిడి పెరిగింది. నన్కానా సాహిబ్ గురుద్వారాపై భారత్ డ్రోన్ దాడి చేసిందని పాకిస్తానీ ఖాతాలు చేసిన తప్పుడు క్లెయిమ్స్ తో భారత్లో సిక్కు సమాజంలో కల్లోలాన్ని రేకెత్తించే ఉద్దేశ్యంతో ఉందని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ గుర్తించింది. అయితే తప్పుడు క్లెయిమ్స్ ఆయా దేశాల మీడియా ఖ్యాతిని అంతర్జాతీయంగా దెబ్బతీశాయి. మీడియా సంస్థలు విశ్వాసాన్ని కోల్పోయాయి. ప్రస్తుత ఏఐ, డిజిటల్ యుగంలో న్యూస్ చానల్స్, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని మొదటిసారే విశ్వసించకుండా క్రాస్ చెక్ చేసుకోవడం మంచిది. ఇలాంటి ప్రచారాలు జరగకుండా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ సైతం తమ అల్గారిథమ్ లో మార్పులు చేయాల్సిన అవసరముంది. న్యూస్ చానల్స్ కూడా బాధ్యతగా వ్యవహరించి వాస్తవాలను మాత్రమే ప్రసారం చేయాలి.

పాకిస్తాన్లోని కిరానా హిల్స్ వద్ద ఉన్న అణు స్థావరాలపై భారత్ దాడి చేసిందని, దీని వల్ల న్యూక్లియర్ రేడియేషన్ లీక్ అవుతోందని ఒక పత్రం సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటిస్తున్నట్లు ఏఐ ద్వారా ఈ పత్రాన్ని క్రియేట్ చేశారు. స్థానిక ప్రజలు వాంతులు, తలనొప్పి, వికారం వంటి లక్షణాలతో బాధపడుతున్నారని, ఇది రేడియేషన్ లీక్కు సంకేతమని అందులో పేర్కొన్నారు. భారత సైనిక దాడులు సర్గోధా, నూర్ ఖాన్ ఎయిర్బేస్లను లక్ష్యంగా చేసుకున్నాయని, కిరానా హిల్స్ సమీపంలో జరిగిన దాడుల వల్ల రేడియేషన్ లీక్ జరిగిందని ఇందులో పేర్కొన్నారు. దీన్ని 'ఎక్స్'లో కొన్ని లక్షల సార్లు షేర్ చేశారు. దీంతో పాకిస్తాన్ తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన నెలకొన్నది. ఒక సందర్భంలో ఇది భారత్-పాకిస్తాన్ మధ్య అణు యుద్ధ భయాన్ని సైతం రేకెత్తించింది. అయితే ఇది నకిలీదని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ స్పష్టం చేసింది. పాకిస్తాన్లో ఎటువంటి న్యూక్లియర్ రేడియేషన్ లీక్ కాలేదని చెప్పింది. ఈ పత్రంలో అనేక తప్పులు ఉన్నాయని పేర్కొంది. భారత్ చర్యలు సంప్రదాయ ఆయుధాల పరిధిలోనే ఉన్నాయని, అణు స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కూడా స్పష్టం చేశారు.

- ఫిరోజ్ ఖాన్
9640466464

## ఇంటి దొంగలు

తల్లి పాలు తాగి
రొమ్ము గుద్దే తనయులు
హక్కుల దారి వెంట వస్తు
దారిని మూసే దరిద్రులు
తిన్నంటి వాసాలు
లెక్కపెట్టే మోసగాళ్లు
సహాయం చేసే చేతులను
నరికే నరరూప రాక్షసులు
కని పెంచిన వాళ్లను సహితం
కనికరించని కఠినాత్ములు
పేగు బంధాలను
పట్టించుకోని పాపాత్ములు
అధికారం కోసం, ఆస్తుల కోసం
అన్నదమ్ములను, తల్లిదండ్రులను
అమానవీయంగా హతమార్చించే
దగా కోరు ఇంటి దొంగలు
పురాణాల్లో వెతికిన
ప్రస్తుత సమాజంలో చూసిన
ఎక్కడ చూసిన అక్కడ వీరే
ఈశ్వరుడైన వీరిని గుర్తించలేరు

- నెరువట్ల చైతన్య
9491470746

## నీ హృదయానికి..

పుట్టుకతో వచ్చే లక్షణాలు
క్రమంగా అలవాట్లుగా
గుణాలుగా మారుతాయి ఆ గుణాలు
నలుగురు ఆచరించేలా ఉండాలి
స్ఫూర్తి పెంచేలా ఉండాలి
చెడు గుణాల్ని త్యజించి
మంచి కర్మలని చేసిన రోజే

ఓ మనిషి పరిణతి చెందుతాడు
ఓ మనిషి పరిగణలోకి వస్తాడు
ఏది సరైనదో నీ హృదయానికి
తప్పక తెలుస్తుంది.. తప్పని తెలిసినా
తప్పదని నువ్వు చెయొద్దు
ఆ ఈశ్వరుడిని
వదులుకోవద్దు

- కోటం త్రిశూల్
8523005678

## ఉగ్రవాదానికి సామాజిక పరిష్కారం



రాజకీయ , మతపరమైన లేదా సైద్ధాంతిక లక్ష్యాల కోసం జనాభాను లేదా ప్రభుత్వాన్ని బెదిరించ డానికి హింసను సృష్టించడం ఉగ్రవాదంగా పే ర్కొంటారు. ఉగ్రవాదం దేశ భద్రతకు సవాల్ విసుర తోంది. ప్రజల ఆర్థిక, సమాజిక జీవనాన్ని దెబ్బతీస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా నష్టం. దేశాభివృద్ధికి విఘాతంగా మారుతుంది. మే 21, 1991లో తమిళనాడులోని శ్రీ పెరంబుదూర్ లో జాతీయ ఎన్నికలకు పార్టీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ ప్రచార సభలో రాజీవ్‌గాంధీ ప్రసంగిస్తున్నప్పుడు ఉగ్రవా దుల చేతుల్లో హత్యకు గురైయ్యారు. ఆ తర్వాత భారత ప్రభు త్వం ఇటువంటి సంఘటనలు జరగకూడదనే ఉద్దేశ్యంతో ఈ రోజును జాతీయ ఉగ్రవాద వ్యతి రేక దిననోత్సవంగా ప్రకటించింది. ఇది భారతదేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి రోజు అని చెప్పవచ్చు. మానవత్వం, కోసం పాటుపడేలా ప్రజలలో ఐక్యతను పెంపొందించడం కోసం ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ప్రపంచ శాంతి కోసం అహింస సందే శాన్ని ప్రజలకు అవగతమ య్యేలా చేయడం, యువత పెడదోవ పట్టకుండా చేయడం వంటివి ఈ దినోత్సవం ముఖ్యోద్దేశాలు. ఈ రోజున ఉగ్ర వాద వ్యతిరేకంగా పోరాడిన వేలాది మంది సైనికులు చేసిన త్యాగాలను గుర్తుచేసుకోవడమే కాక వారికి నివాళుల అర్పిస్తారు. మానవత్వం మరియు శాంతి సందేశాన్ని ప్రచారం చేయడం జరుగు తుంది.

భారత దేశంలో ఉగ్రవాదం ప్రదానంగా బోర్డర్ నుంచి పొంచి ఉంది. ఇది దేశవ్యాప్తంగా కూడా విస్తరించే ప్రమాదం ఉంది. మన దేశసరిహద్దు దేశాలకు మధ్య ఉన్న రాష్ట్రాలకు నిరంతరం వలసలు రావడం వలన ఉగ్రవాద ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా చైనా, పాకిస్తాన్ సరిహద్దు రాష్ట్రాలతో మనకు ప్రమాదం ఉంది. ఇటివల జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామి ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిలో 28 అమాయక భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాద ముప్పు తొలగిపోయిందన్న నేపథ్యంలో ఈ దాడి జరగడం మరొకసారి భారతదేశాన్ని భయోందోళనలకు గురిచేసింది. దీనికి భారతదేశం ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రతిదాడి చేసింది. ఇప్పటికే భారత దేశంపై పలు మార్లు ఉగ్రదాడి జరిగింది. చాలా ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. కానీ గత కొంతకాలం నుంచి భారత్ వివిధ దేశాలతో కొన సాగిస్తున్న దౌత్య సంబంధాల నేపథ్యంలో ఉగ్ర దాడి తగ్గిన సంగతి తెలిసింది. మరోవైపు భారతదేశంలో వేల సంవత్సరాల నుంచి చాప కింద నీరులా కొనసాగుతున్న సామాజిక వివక్షత వలన అంతర్గత సంఘర్షణను పెరుగుతున్నాయి. కులం పేరుతో విభజించి అవకాశాలు అంద కుండా చేయడం కూడా ఉగ్రవాదమే. ముఖ్యంగా రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు కొన్ని వర్గాల వారికే అందడం వలన సమాజంలో అంతర్గత కలహాలు పెరిగిపోతాయి. దీంతో గతంలో వామపక్ష తీవ్రవాదం తీవ్రంగా పెరిగి పోయింది. ఇప్పటికీ అక్కడక్కడ కొనసాగుతుంది. దీనికి ప్రధాన కారణాన్ని అన్వేషించి పరిష్క రించాల్సిన అవసరం ప్రభుత్వాలపైన ఉన్నాయి. కానీ ఇటీవల చత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని కర్రెగుట్టల వద్ద ఆపరేషన్ కగారు పేరుతో అణచివేయడం వలన వామపక్ష తీవ్రవాదం అంతం కాదు. అనేక ప్రజా సంఘాల సైతం దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. అతిపెద్ద జనాభా గల భారతదేశంలో అంతర్గత మరియు బహిర్గత ఉగ్రవాదం అత్యంత ప్రమాదకరం. దీన్ని నిలువరించాలంటే ప్రపంచ దేశాలతో స్నేహపూరిక దౌత్యసంబంధాలను పెంపొం దించుకోవాలి. సరిహద్దు దేశాలతో ఉన్న బార్డర్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించు కోవా లి. ఉగ్రవాదం అంతం చేయడానికి ఆధునిక సాం కేతికను వాడాలి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశాలపై నిఘా పెట్టాలి. భారతదేశంలో అంతర్గ తంగా అశాంతి కూడా ఉగ్రవాదానికి ఆజ్యం పోస్తుంది. ముఖ్యంగా మతోన్మాదాన్ని నివారించా లి. కులం పేరుతో కొనసాగుతున్న అణచివేతను తగ్గించాలి. అన్ని రంగాలలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అవకాశాలు కల్పించాలి. ఉగ్రవా దం అంటే తుపాకిలతో కాల్చాడం. బాంబులను పేల్చాడం ఉగ్రవాదం కాదు, ప్రజలను కులాలుగా, మతాలుగా విభజించడం కూడా అతి భయంకరమైన ఉగ్రవాదమే అని గుర్తెరిగి నడుచుకోవాలి.

- సంపతి రమేష్ మహారాజ్
7989579428

# చంద్రబాబు మోసాలని విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- **జగ్గయ్యపేటలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ సభలో మోదుగుల వేణుగోపాల రెడ్డి**



**జగ్గయ్యపేట జులై 7 మనం న్యూస్:** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్న మేనిఫెస్టో లోని ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదని అక్రమ కేసులతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను కార్యకర్తలను వేధిస్తున్నారని బాబు ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రంజగ్గయ్యపేట పట్టణ, శుభమస్తు కల్యాణ మండపం నందు వై.యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు, అమలు చేయకపోవడాన్ని రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో దీనికి సంబంధించి క్యూఆర్ కోడ్ ఆవిష్కరించి, నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎన్టీఆర్ జిల్లా పార్లమెంటు పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి , నందిగామ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు ఇంచార్జ్ మొండితోక జగన్మోహన్ రావు లు పాల్గొన్నారు. ఇందులో భాగంగా పార్టీ నాయకులుకు,కార్యకర్తలకు, అభిమానులకు బాబు షూరిటీ మోసం గ్యారంటీ ప్రజల్లో చైతన్యం పరచాలని మరియు ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎంత మేర నెరవేర్చారు ప్రజలకు అడిగి తెలుసుకోవాలా దిశ నిర్దేశం చేసారు.సమావేశ ప్రారంభ నీకి ముందుగా వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నేతలుఘనంగా నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా పార్లమెంటు పార్లమెంట్ పరిశీలికులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమవుతున్న ఏ ఒక్క పథకం అమలు చేయకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన సానుభూతి పరుల పైన అక్రమ కేసులు అమలు చేయడంలో ముందుందని అన్నారు. బాబు షూరిటీ మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరించిన నాయకులు కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాల మోసాల పై ప్రజల్లోకి తీసుకు పోయాలని విస్తృత స్థాయి చర్చ జరిగేలా చూడాలన్నారు. చంద్రబాబు రీ కాల్ మ్యానిఫెస్టో గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు పిలుపు ఇచ్చారు. నందిగామ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ఇంచార్జ్ మొండితోక జగన్మోహన్ రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ ఏడాది పాలనపై, చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలు విస్మరించి పాలన సాగించడం, సంక్షేమ పథకాలు ఎగ్గొట్టి ప్రజలకు ఎంత బకాయిలు పడ్డారనేది, దీనిపై ప్రజలను చైతన్యపరచడంపై విస్తృతస్థాయి సమావేశంలో వివరించారు. మొత్తం నాలుగు దశల్లో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టోను చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ ప్రతి ఇంటికి వెళ్లాలి అన్నారు. కార్యక్రమాన్ని ఎలా చేయాలనేది వివరిస్తూ క్యూఆర్ కోడ్ ద్వారా డాక్యుమెంట్ రిలీజ్ చేయడంతోపాటు చంద్రబాబు ఇచ్చిన బాండ్లు గురించి, జగనన్న గతంలో ఇచ్చిన పథకాలు ఎలా ఎగరగొడుతున్నారు, అలాగే చంద్రబాబు మోసాల వల్ల నష్టం ఎంత, దీనికి సంబంధించిన ఫార్మాట్లు ఎలా నింపాలన్నదానిపై వివరించారు. చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అన్నది ప్రజల్లోకి వెళ్ళాలి. టీడీపీ నాయకులు ప్రజల వద్దకు వచ్చినప్పుడు వారిని నిలదీయాలి అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం అయిందని రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వలేదన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకు పెన్షన్ ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మభ్యపెడుతున్నారు అన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదన్నారు, అలాగే జాబ్ క్యాలెండర్ కూడా వదలడం లేదన్నారు. రాబోయే రోజులు మనకు మంచి రోజులు వస్తాయని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటింటికి వెళ్లి క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి, చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను 'బాబు షూరిటీ మోసం గ్యారెంటీ' గురించి ప్రతి ఒక్కరికి వివరించాలని సూచించారు. దీంతోపాటు సాక్షితో పాటు మరికొన్ని చానల్స్ ప్రసారాలు రాకుండా చేసిన దుర్మార్గపు చర్యపై కూడా కేబుల్ ఆపరేటర్ను నిలదీసి ఆ ఛానల్స్ ప్రసారాలు అందుబాటులోకి వచ్చేలా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్( చిన్న,), రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి శీనువాస్ రెడ్డి, రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షులు మార్కపుడి గాంధీ, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, రాష్ట్ర చేనేత విభాగ కార్యదర్శి పెంటి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, రాష్ట్ర ప్రచార విభాగ కార్యదర్శి చౌడవరపు జగదీష్, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరి రవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సంపత్ విజిత, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ఏలూరి శివాజీ, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు బూడిది నరసింహారావు, పొన్నం కోటేశ్వరరావు, గుత్తా శంకర్రావు, రేఖ శ్రీనివాసరావు, ఎంపీపీ కొలుసు రమాదేవి, జడ్పిటిసిలు ఏసు పోగు దేవమణి, వూట్ల నాగమణి, పసుపులేటి శ్రీనివాసరావు, తదితరులు నాయకులు కార్యకర్తలు మహిళ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మల్లును కలిసిన కొలికపూడి



**తిరువూరు, జూలై 07(మనం న్యూస్):** తెలంగాణా ఉపముఖ్యమంత్రి మల్లు బట్టివిక్రమార్కను, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సోమవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ఇద్దరికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేసే రోజుల నుండి పరిచయమని కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. 30 ఏళ్ల నుండి తాము మంచి స్నేహితులుగా కొనసాగుతున్నామని తెలిపారు. తెలంగాణ సచివాలయం లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ని మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం ఇరువురు సమకాలిన రాజకీయాల గురించి చర్చించుకున్నారు.

## జైల్లో కుదిరిన స్నేహంతో, ముఠాగా ఏర్పడి పలు జిల్లాల్లో చోరీలు



**గుడివాడ, జూలై 07 (మనం న్యూస్):** అంతర్ జిల్లాల దొంగల ముఠాను కృష్ణా జిల్లా పామర్రు పోలీసులు పట్టుకున్నారు. గుడివాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో గుడివాడ డిఎస్పి ధీరజ్ వినిల్ కేసు వివరాలు వెల్లడించారు. డి.ఎస్.పి వినీల్ మాట్లాడుతూ పామర్రు మండలం మలయప్పన్ పేటలో చోరీ కేసులో ఐదుగురు అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 5 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో వేరు, వేరు కేసుల్లో అరెస్టయి జైలు కెళ్ళిన వారంతా జైలులో ఒకరికి ఒకరు పరిచయమయ్యారు. ఆ తరువాత బెయిల్ పైన బయటకు వచ్చిన తరువాత జైలులో పరిచయమయిన వారంతా కలిసి ఒక ముఠా సభ్యులుగా ఏర్పడి, చోరీలు మొదలుపెట్టారని ఆయన పేర్కొన్నారు. ముఠా సభ్యుల్లో గుడివాడ, ఉయ్యూరు, కైకలూరు, ఏలూరు తదితర ప్రాంతానికి చెందిన వ్యక్తులు ఉన్నట్లు తెలిపారు. దొంగల ముఠా సభ్యులను పట్టుకున్న సిసిఎస్ పోలీసులకు రివార్డులను డి.ఎస్.పి ధీరజ్ వినీల్ అందించారు.

# వైద్య కళాశాలల్ని ప్రైవేటు పరం చేయొద్దు

- **ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీని ముట్టడించిన వైఎస్సార్సీపీ విద్యార్థి నేతలు**



**విజయవాడ తూర్పు, జూలై 07 (మనం న్యూస్)** జగన్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన 17 ప్రభుత్వ వైద్య కళాశాలల్ని ప్రైవేట్ భాగస్వామ్యానికి ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమవారం నాడు విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్నివిద్యార్థులు ముట్టడించి ధర్నా చేశారు. ముందుగా గుణదల నుండి రామవరప్పాడు రింగ్ మీదుగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వరకు విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీకి విద్యార్థులు చేరుకోగానే విద్యార్థులను అదుపు చేసేందుకు పోలీసులు విఫలయత్నం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులకి, విద్యార్థి నేతలకి మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో యూనివర్శిటీ ఎదుట సోమవారం నాడు ఉద్రిక్త పరిస్థితి నెల కొంది. అనంతరం వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. రవిచంద్ర మాట్లాడుతూ పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకి వైద్య విద్య అందించాలనే సంకల్పంతో వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ వైద్య కళాశాలల్ని ఏర్పాటు చేసారన్నారు. అందుకోసం 8 వేల 480 కోట్ల రూపాయలు కేటాయించారని తెలిపారు. అందులో 2023-24 విద్యా సంవత్సరంలో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలకి 150 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున మొత్తం 750 సీట్లు మంజూరు అయ్యాయన్నారు. తర్వాత పులివెందుల, పాడేరు, మదనపల్లె, మార్కాపురం, ఆదోని వైద్య కళాశాలలకి వైద్య సీట్లు మంజూరు అయ్యే సమయానికి ప్రభుత్వం మారిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వైద్య కళాశాలల సీట్ల కోసం కనీస ప్రయత్నం చేయలేదని దుయ్య బట్టారు. పైగా పులివెందుల వైద్య కళాశాలకి ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేయొద్దని జాతీయ వైద్య మండలికి లేఖ రాశారన్నారు. దేశంలో పేద విద్యార్థులకి ప్రభుత్వ రంగంలో వైద్య సీట్లు వద్దని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని విమర్శించారు. జగన్ ఏర్పాటు చేసిన 17 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పది కళాశాలలని ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహించడమంటే పేద, ప్రతిభావంతులకి వైద్య విద్యని దూరం చేయడమే అని విమర్శించారు. జగన్ 2,550 వైద్య సీట్లు రాష్ట్రానికి తీసుకొచ్చారని కొనియాడారు. వైద్య సీట్లు మా రాష్ట్రానికి వద్దంటూ కేంద్రానికి లేఖ రాసి చంద్రబాబు అన్యాయం చేసారని మండిపడ్డారు. జగన్ పేదల పక్షపాతి గా నిలిస్తే చంద్రబాబు కార్పొరేట్, ప్రయివేట్ వర్గాలకి తొత్తుగా మారాడని ధ్వజమెత్తారు. ప్రశ్నిస్తామని చెప్పిన పవన్ కళ్యాణ్ చంద్రబాబు, లోకేష్ లు ఇరువురు చేస్తున్న దమనకాండల్ని ఏ మాత్రం పట్టించు కోవడం లేదన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వల్ల లక్షల రూపాయలు చెల్లించి వైద్య సీట్లు కొనుక్కోలేని విద్యార్థులు తీవ్రంగా నష్టపోనున్నారని తెలిపారు. ఈ ధర్నాలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబుల్ రెడ్డి, ఆనంద్, ప్రధాన కార్యదర్శి కె. శివారెడ్డి, నాయకులు ఆశ్రిత్ రెడ్డి, కొండల్ రావు, అభిషేక్, విజయ్, వంశీ యాదవ్, కోమల్ సాయి, సురేష్, నంద రెడ్డి పాల్గొన్నారు.

# దుర్గమ్మ బంగారం భద్రం



**విజయవాడ పశ్చిమ, జూలై 7 (మనం న్యూస్):** బెజవాడ కనకదుర్గమ్మకు భక్తులు వివిధ సందర్భాలలో కానుకలుగా సమర్పించిన 29 కేజీల 510 గ్రాముల బంగారాన్ని గత కొంత కాలంగా స్ట్రాంగ్ రూములో అధికారులు భద్రపరిచారు. అయితే వాటన్నిటినీ సోమవారం నాడు విజయవాడలోని గాంధీనగర్ స్టేట్ బ్యాంకులో (జి.ఎం.ఎస్) గోల్ మానిటైజేషన్ పదకం కింద సంవత్సరానికి 0.60 శాతం వడ్డీ బ్యాంకు దేవస్తానంకు చెల్లించే విధంగా బంగారు ఆభరణాలను బ్యాంకులో ఆలయ కార్య నిర్వహణ అధికారి వి కే శీనా నాయక్ సోమవారం నాడు డిపాజిట్ చేశారు. సోమవారం విజయవాడ మార్కెట్ ధర ప్రకారము 22 క్యారెట్ బంగారం ధర గ్రాముకు రూ.9, 0 1 0 ధర పై బ్యాంకుకు అప్పగించారు.అప్పగించిన బంగారం విలువ సుమారు 26 కోట్ల 58 లక్షల 85 వేల రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. బంగారం అప్పగించేందుకు ప్రత్యేక కమిటీని నియమించారు. బంగారు పరిశీలన అధికారి, అసిస్టెంట్ కమిషనర్ దేవాదాయ శాఖ పల్లంరాజు, విజయవాడ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం పర్యవేక్షకులు సుబ్రమణ్యం, దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థాన కమిటీ 1. ఏఈఓ పి చంద్రశేఖర్, 2. ఏఈఓ ఎన్ రమేష్ బాబు, 3. ఏ ఈ ఓ ఎం.ఎస్.ఎల్ వాసు, దేవస్థాన బంగారం అప్రైజర్ డి.షమ్మీ ప్రత్యేక బపోలీసు భద్రత కోసం ఒక హెడ్ కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్ల సమక్షంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గాంధీనగర్ బ్రాంచ్ అధికారులకు అప్పచెప్పగించారు.

## పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవు




- **డిఎస్పీ టి.విద్యాశ్రీ**

**అవనిగడ్డ, జూలై 7 (మనం న్యూస్):** అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని అవనిగడ్డ డి.ఎస్.పి విద్యశ్రీ అన్నారు. సోమవారం అవనిగడ్డ లోని డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో ఇసుక, బుసక, మట్టి లాంటివి అక్రమ రవాణా చేస్తే వారిపై చట్ట రిత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. వాటితోపాటు రేషన్ బియ్యం, మద్యం అక్రమ రవాణా, జూదం, గ్రామాలలో బెల్ట్ షాపులు లాంటివి నిర్వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. కొంతమంది వ్యక్తులు అసాంఘిక కార్యక్రమాలకు అండగా ఉంటూ పోలీసువారి విధులకు ఆటంకం కలిగిస్తున్నారని అలాంటి వారిని ఉపేక్షించేది లేదని అన్నారు. అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న 9440796406 ఈ నంబర్ కి ఫోన్ చేసి వివరాలు తెలియజేయవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు.

## పూజా కార్యక్రమంతో శాకంబరీ అలంకరణ పనులు ప్రారంభం



- **ఇవో వి. కె శీనానాయక్**

**విజయవాడ పశ్చిమ, జూలై 07 (మనం న్యూస్):** సోమవారం ఉదయం 9 గంటలకు ఇంద్రకీలాద్రిపై మహా మండపం ఆరవ అంతస్తులో శాకంబరీ ఉత్సవాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు, పరిపాలన సిబ్బందితో కలిసి ప్రత్యేక పూజలు చేసి తొలి పూజతో కనకదుర్గమ్మకు అలంకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు .వివిధ రకాలైన కూరగాయలు, ఆకుకూరలు, పళ్ళు తో అలంకరణ చేశారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ అమ్మవారు అంటేనే ప్రకృతి అనీ, ప్రకృతిలో లభ్యమయ్యే కూరగాయలు, పళ్ళు, ఆకుకూరలతో అలంకరణ అంటే అమ్మవారికి ఎంతో ప్రీతికరమని అన్నారు. భూలోకంలో సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో జీవించాలని ఈ అలంకరణ చేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి దేవస్థానంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆషాడ శుద్ధ త్రయోదశి నుండి ఆషాడ శుద్ధ పౌర్ణమి వరకు శాకంబరీ ఉత్సవాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ నెల 8 నుండి 10 వరకు శాకంబరీ దేవి ఉత్సవములు దీక్షా పూర్వకంగా, ఎంతో వైభవముగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఇఒ శీనా నాయక్ ప్రకటించారు.



## చిల్లర రాజకీయాలు చేస్తే ప్రజలు తరిమి కొడతారు

- **జగన్కి మాజీ మంత్రి దేవినేని ఉమా స్ట్రాంగ్ వార్నింగ్**

**విజయవాడ రూరల్, జూలై 07 (మనం న్యూస్):** ఐదేళ్లలో ఏమి చేశారో జగన్ ప్రజలకు చెబితే బాగుంటుందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం నాడు గొల్లపూడిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిల్లర రాజకీయాలు చేస్తే ప్రజలు తరిమి కొడతారని జగన్ ను హెచ్చరించారు. జగన్ ఐదేళ్లలో చేయని అభివృద్ధి, కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు ఏడాదిలోనే చేసి చూపించారని అన్నారు. బెయిల్ పై ఉన్న ముద్దాయి, చట్టాలను కాపాడే వ్యవస్థలను బెదిరించేలా బరితెగింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. వైఎస్.రాజశేఖరరెడ్డి హయంలో పెట్టిన కేసులకు తాను ఈ రోజుకు వాయిదాలకు తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. పోలీసు, న్యాయ వ్యవస్థలు సవాల్ గా తీసుకొని జగన్ రెడ్డిపై ఉన్న కేసులను త్వరిత గతిన విచారించాలని న్యాయస్థానా లను కోరారు. అసెంబ్లీకి రాలేని పిరికి వ్యక్తి జగన్ రెడ్డి, ఇలాంటి వ్యక్తి ప్రతిపక్షానికి కూడా పనికిరాడని విమర్శించారు. ప్రజాస్వామ్యమన్నా, కోర్టులన్నా జగన్ కు లెక్క లేకుండా పోయిందన్నారు. జగన్ రెడ్డి నీ వ్యూహకర్తలు ఎవరు ? అన్నం తింటున్నారా ? మరేమైనా తింటున్నారా ..? అంటూ ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని ఒక్క ఛాన్స్ అని తగలబెట్టారన్నారు. మళ్లీ సింగయ్య శవం మీద పేలాలు ఏరుకోమ ని పంపిస్తారా అని ప్రశ్నించారు. మళ్లీ జగన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని ఈ సన్నాసులు రాష్ట్రంలో కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రజలు వైసీపీని 11 సీట్లకు ప్రజలు పరిమితం చేశారన్నారు. మా రాష్ట్రాన్ని పాడు చేయాలనుకుంటే మిమ్మల్ని ప్రజలు తన్ని తరిమేస్తారని అన్నారు.

# బిజెపి పాలన బ్యాంకులు, అప్పులు, అవినీతిమయం

- **బిజెపి నాయకులు వేల కోట్ల రూపాయలు తింటున్నారు**
- **కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతామోహన్**



**విజయవాడ సెంట్రల్, జూలై 07 (మనం న్యూస్):** లక్షల కోట్ల రూపాయలు బ్యాంకు అప్పులను మాఫీ చేసి, బిజెపి నాయకలు వేల కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతామోహన్ అన్నారు. సోమవారం నాడు విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ 100 కోట్ల రూపాయలు రుణమాఫీ చేయాలంటే, బిజెపి నాయకులకు 10 కోట్ల రూపాయల ముడుపులు ముట్ట చెప్పాల్సిందేనని అన్నారు. బిజెపి పాలనలో అవినీతి పదింతలు పెరిగిందని, ఢిల్లీలో అందరూ అనుకుంటున్నారని తెలిపారు. తాను రెండు రోజులు ఢిల్లీలో వీధి వీధి తిరిగి అంతా తెలుసుకున్నట్లు చెప్పారు. ఎన్ పిఎ అసెట్స్, బిజెపి నాయకులకు కోట్ల రూపాయలు ఆదాయ వనరుగా మారిందన్నారు. తెలుగు బాగా తెలిసిన ఓ నిర్మలమ్మా నేను మిమ్మల్ని సూటిగా అడుగుతున్నాను. 100 కోట్లు రూపాయలు పైబడి దేశంలో ఏ రాష్ట్రంలో ఎంత ఎన్ పిఎలు అయ్యాయి అంటూ కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ కు ప్రశ్నలు సందించారు. ఆంధ్రప్రదేశ్ లో ఎంత ? తెలంగాణలో ఎంత ? కర్ణాటకలో ఎంత ? తమిళనాడులో ఎంత ? లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. క్రూడాయిల్ రష్యా నుండి 60 శాతం సబ్సిడీతో, భారత దేశానికి వస్తుందన్నారు. పెట్రోల్ బంకుల్లో రూ. వంద రూపాయలు లేనిదే పెట్రోల్ పట్టడం లేదన్నారు. రష్యా నుంచి క్రూడాయిల్ పై వచ్చే సబ్సిడీ ఎక్కడికి పోతుందో కేంద్ర సమాధానం చెప్పాలన్నారు. కమ్యూనిస్టుల గుండెల్లో నుంచి ఉపాధి హామీ చట్టం మొదలైందన్నారు. కామ్రేడ్ హరికిషన్ సింగ్ సూర్జిత్ నివాసంలో రూప కల్పన జరిగిందన్నారు. ఆ రోజు అక్కడ తాను ఉన్నానని అన్నారు. సోనియా గాంధీ ఆ చట్టం చేయడానికి ఒప్పుకున్నారని తెలిపారు. యుపిఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం తెచ్చిందన్నారు. ఆ చట్టం వలన పేదవాళ్ళు ప్రతి రోజూ, భోజనం తినగలుగుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని, కూటమి ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. 90శాతం డబ్బు కూలీలకు ఇవ్వాల్సి ఉండగా 10 శాతం ఉపాధి కూలీలకు ఇచ్చి, 90 శాతం ఉపాధి డబ్బును మెటీరియల్ చార్జీలకు వాడుతున్నారనిమండిపడ్డారు. ఒక మంత్రి కోటీశ్వరులకు సహాయం చేస్తున్నారని అన్నారు. 10 వేల మంది ఫీల్ అసిస్టెంట్లు పని చేసినా గానీ వాళ్లలో ఒక్కొక్కరికి కూడా ఒక లక్ష రూపాయలు గ్రాడ్ డ్యూటీ ఇవ్వలేదన్నారు. మూడు నెలలుగా జీతభత్యాలను కూటమి ప్రభుత్వం ఆపిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. అంబేద్కర్ రాసిన గొప్ప రాజ్యాంగం వల్లే భారతదేశం వర్ధిల్లతావుంది. ఆయనకు సెల్యూట్ చేస్తున్నాను. జర్నలిజం క్యాపిటలిజం అయిపోతుందని, జర్నలిస్టులే చెప్తున్నారని పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛ లేదన్నారు. ఉందని ఒక్క జర్నలిస్ట్ చెప్తే, పూల మాల వేసి, శాలువా కప్పి, సత్కరిస్తానన్నారు. అమరావతి రాజధాని పేరుతో చంద్రబాబు నాయుడు రైతుల నోరు కొడుతున్నారని అన్నారు. తాను ఒక ఒక రైతును కలిసి ప్రశ్నించగా ఆ రైతు అయిష్టంగా 90 ఎకరాలు ఇచ్చానని తనతో అన్నారని చెప్పారు. 1000 గజాలు ఇంటి స్థలం, 400 గజాలు కమర్షియల్ కాంప్లెక్స్ కొరకు ఇస్తామని చెప్పి, ఇంత వరకు ఇవ్వలేదని బాధపడ్డాడనొ తెలిపారు. అమరావతికి తాను వ్యతిరేకం కాదంటూనే చంద్రబాబు నాయుడి ఆలోచనా విధానం విఫలమవుతుందని జోస్యం చెప్పారు. నిన్న సిఆర్డిఎకు 30 వేల ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని, అక్కడ మూరెడు మట్టి తీస్తే, చారుడు నీళ్లు వస్తాయన్నారు. విజయవాడలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండగా 30 కిలోమీటర్ల దూరంలో అమరావతిలో, మరో అంతర్జాతీయ విమానాశ్రయం, 5 వేల ఎకరాల భూముల్లో అంతర్జాతీయ విమానాశ్రయం ఎందుకంటూ ప్రశ్నించారు. రైతుల నోర్లు కొట్టి, వారికి ఇస్తామని చెప్పిన పరిహారం ఇవ్వలేదన్నారు. చంద్రబాబునాయుడు రైతులకు నష్టం చేసి, ఏదో సాధించాలని అనుకుంటున్నారనీ , కానీ సాధించలేరనీ తేల్చి చెప్పారు. భారతదేశంలోనే కాదు, ప్రపంచంలో 50 అంతస్తుల సచివాలయం ఎక్కడా లేదన్నారు. తెలంగాణలో కెసిఆర్ హయాంలో సచివాలయం కట్టారనీ, అలాంటివి ఒకటో, రెండో కట్టుకుంటే ఖర్చు తగ్గుతుందన్నారు. పదింతలు ఖర్చు మిగులుతుందన్నారు.

## జూలై 9న రథం సెంటర్ నుంచి లెనిన్ సెంటర్ కు భారీ ర్యాలీ

### కార్మిక సంఘాల నిర్ణయం



**విజయవాడ పశ్చిమ, జూలై 07 (మనం న్యూస్):** దేశవ్యాప్తంగా జూలై 9 సమ్మెలో భాగంగా విజయవాడ నగరంలోని వన్ టౌన్ రథం సెంటర్ నుంచి లోబ్రిడ్జి మీదుగా, ఏలూరు రోడ్డు మీదగా, లెనిన్ సెంటర్ వరకు కార్మికుల, రైతుల భారీ ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించినట్లు సోమవారం నాడు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు సోమవారం బిఆర్ టిఎస్ రోడ్ లోని సిఐటియు నగర కార్యాలయంలో జిల్లా కార్మిక సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని యూనియన్లు కలిసి సంయుక్తంగా వేలాదిమంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, వివిధ చేతి వృత్తులు, ఉపాధి హామీ కూలీలతో పెద్ద ఎత్తున వేలాది మందితో ప్రదర్శన అనంతరం బహిరంగ సభ నిర్వహించాలని జిల్లా నాయకత్వం నిర్ణయించిందన్నారు. ఉదయం 9 గంటలకు రథం సెంటర్లో ప్రదర్శన ప్రారంభమవుతుందని, అన్ని యూనియన్లు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్లు, నూతన వ్యవసాయ మార్కెట్ విధానానికి వ్యతిరేకంగా, కౌలు రైతు చట్టం, రుణ విమోచన చట్టం, అన్ని పంటలకు కనీస గిట్టుబాటు ధర చట్టం, కనీస వేతన చట్టం తదితర అంశాలు చట్టబద్ధం చేయాలని కోరారు. బడా కార్పొరేట్ కంపెనీలకు లాభాలు దోచి పెట్టేందుకు చట్టాలు చేయడం కాదని, కార్మిక, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కూలీల సంక్షేమం, వారి అభివృద్ధి కోసం పాటుపడాలని, వారి జీవనోపాధి కోసం, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వాలు పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తన నిజస్వరూపాన్ని బట్టబయలు చేసిందని స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తుందని, పెట్టుబడిదారుల సేవలో పునీతమైపోయిందని విమర్శించారు.

## మొహరం అంటే త్యాగానికి నిదర్శనం

### టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య



**ఇబ్రహీంపట్నం, జూలై 07 (మనం న్యూస్)** మొహర్రం అంటే త్యాగానికి నిదర్శనమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య అన్నారు. కొండపల్లిలో జరిగిన పీర్ల ఊరేగింపులో పాల్గొన్న ఆయన మొహర్రం పండుగ సందర్భంగా ఆదివారం రాత్రి కొండపల్లి పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహర్రం అంటే ఎంతో పవిత్రమైన పండుగ అని అన్నారు. ముస్లింలు సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగను నిర్వహించి, నిప్పుల గుండం తొక్కి తాము నమ్ముకున్న ధర్మం కోసం దేనికైనా సిద్ధంగా ఉంటామని తెలిపే సంకేతమే మొహరం పండుగ ప్రత్యేకత అని తెలిపారు. ఈ సందర్భంగా ఊరేగింపుగా పీర్లలో ముస్లిం మత పెద్దలు, స్థానిక టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు తో కలిసి ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.

# వేధిస్తున్న వెబ్ ల్యాండ్



- ఆన్లైన్ నమోదుకు అవాంతరాలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- క్లియర్ టైటిల్ ఉన్న భూములు సైతం అప్లై కానీ వైనం
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- నిస్సహాయ స్థితిలో తాసిల్దారులు
- వెబ్సైట్ నిర్వహణపై విమర్శలు

**కర్నూలు, జూలై 7(మనం బ్యూరో):** రెవెన్యూ శాఖలో వెబ్సైట్ సమస్య వేధిస్తోంది. భూములను ఆన్లైన్ చేసుకోవాలనుకునే రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. క్లియర్ టైటిల్ ఉన్న భూముల బదలాయింపులకు సంబంధించి ఆన్లైన్లో అప్లై చేసుకోవడానికి వెళితే ఎర్రర్ చూపించడం.. అసలు ఒక్కోసారి సైట్ ఓపెన్ కాకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇదంతా వెబ్సైట్ నిర్వహణ సరిగా లేకపోవడం వల్లే జరుగుతోందని తెలుస్తోంది. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కర్నూలు జిల్లాలో భూమి విస్తీర్ణం 17,658 చదరపు కిలోమీటర్లు లేదా 17,65,800 హెక్టార్లలో ఉంది.ఇందులో అటవీ ప్రాంతం 3.406 లక్షల హెక్టార్లు. ఇది మొత్తం భౌగోళిక ప్రాంతంలో 19.29% గా ఉంది. మిగిలిన భూమిలో వ్యవసాయ భూములు, నివాస ప్రాంతాలు మరియు ఇతర అవసరాలకు ఉపయోగించే భూములు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో భూముల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. దీంతో ప్రతి సెంటు భూమికి సక్రమమైన సమగ్రమైన రికార్డు తప్పనిసరి అవుతోంది. ప్రజల్లో కూడా భూమి స్వభావం అనుభవం తదితర అంశాలపై అవగాహన పెరుగుతోంది. అయితే ఇటీవల కాలంలో భూములను ఆన్లైన్లో నమోదు చేయించుకోవడం రైతులకు పెద్ద సవాల్ గా మారినది. వెబ్సైట్ సరిగా పనిచేయకపోవడంతో తహసిల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నెలల తరబడి వీఆర్వో లు, తహసీల్దార్ ల చుట్టు తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో ఏం చేయాలో అర్థం గాక బాధితులు దిక్కు తోచని పరిస్థితి ని ఎదుర్కొంటున్నారు.రూ. లక్షలు లేదా కోట్ల రూపాయల విలువ చేసి భూములు కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నా అవి ఆన్లైన్లో తమ పేరు మీదికి మార్కపోవడంతో ఆందోళన గురవుతున్నారు. ఈసీ లో తమ పేర్లు నమోదైన ఆన్లైన్లో తమ పేర్లు మీదికి భూమి బదలాయింపు జరగకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఏర్పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఎన్నిసార్లు అప్లై చేసినా ఎర్రర్

భూమి కొనుగోలు చేసిన వ్యక్తులు ఆన్లైన్లో పేరు మార్చుకోవడం కోసం మ్యుటేషన్ కు అప్లై చేస్తే సర్వర్ సమస్య ఇబ్బంది పెడుతోంది.ఎన్నిసార్లు అప్లై చేసినా చివరకు ఎర్రర్ వస్తోంది. సమస్యకు పరిష్కారం ఏమిటని రెవెన్యూ అధికారులను అడిగితే సమాధానం చెప్పలేని స్థితిలో వారు ఉండి పోతున్నారు. దీని అంతటికి కారణం అమరావతి కేంద్రంగా వెబ్సైట్ నిర్వహణ సరిగా లేకపోవడమేనని తెలుస్తోంది. అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూముల మ్యుటేషన్కు ప్రభుత్వం ఎలాగు అనుమతి ఇవ్వడం లేదు.

అయితే పక్కా పట్టా భూములకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు లేకున్నా అవి కూడా మ్యుటేషన్ కావడం లేదు. కర్నూల్ రూరల్ మండల పరిధిలోని దిన్నె దేవరపాడుకు చెందిన బోయ రామకృష్ణకు 197 సర్వే నెంబర్ లో 60 సెంట్లు భూమి ఉంది. ఇది పక్కా పట్ట భూమి రోడ్డు విస్తరణలు భాగంగా కొంత ప్రభుత్వం భూమిని తీసుకోవడంతో అను సంబంధించిన పరిహారం కూడా ఆ రైతుకు వెళ్ళింది అయితే ఆ అందులో కొంత భూమిని తన కుమారుని పేరు మీద సెటిల్మెంట్ కింద రిజిస్టర్ చేయించి ఇచ్చాడు.ఆ భూమిని తన కుమారుని బోయ హరి కిరణ్ పేరు మీదికి ఆన్లైన్లో మార్చుకోవడం కోసం దరఖాస్తు చేసుకుంటున్నా వెబ్సైట్లో నమోదు కావడం లేదు దాదాపు మూడు నెలలుగా ఈ రైతు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు ఈ సమస్యకు పరిష్కారం అని ఎవరిని అడిగినా సరైన సమాధానం దొరకడం లేదు దీంతో బాధితు రైతు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. ఎవరికి సమస్యలు చెప్పుకోవాలి ఎలా పరిష్కరించుకోవాలి అర్థం కాక తల పట్టుకుంటున్నాడు. ఈ ఒక్కరైతే కాదు జిల్లాలో ఇలా ఎంతో మందిఇదే సమస్యపై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## ఎఫ్పీఓఎల్ఆర్లోనూ అదే పరిస్థితి

తాసిల్దార్లకు ఇచ్చిన ప్రత్యేక లాగిన్ అయినటువంటి ఎఫ్పీఓ ఎల్ఆర్ లోను అదే పరిస్థితి కనిపిస్తోంది.

అక్కడ దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్ తీసుకోవడం లేదు. భూ వ్యవహారాల సంబంధించి ఎప్పటినుంచో తాసిల్దార్లు సమస్యను పరిష్కరించేవారు. అయితే, ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఎవరో ఎక్కడో ఏదో తప్పు చేశారన్న ఉద్దేశంతో ప్రభుత్వం వెబ్సైట్లను సరిగా నిర్వహించడం లేదని విమర్శలు ఉన్నాయి. భూముల వ్యవహారాలకు సంబంధించి దగ్గరుండి పరిశీలించి తమకే ఇలాంటి పరిస్థితులు ఎదురవడంపై తహసిల్దార్ల నుంచి విస్మయం వ్యక్తమవుతోంది.

## ప్రైవేట్ ల్యాండ్ల పరిస్థితి ఇలా ఉంటే..

కొనుగోలు చేసిన ప్రైవేట్ ల్యాండ్లే ఆన్లైన్కు నోచుకోకపోతే మిగతా భూముల పరిస్థితి ఏంటి అన్న ప్రశ్న తలెత్తుతోంది.. సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం తాసిల్దార్లకు ప్రత్యేక లాగిన్ కేటాయించిన ఎఫ్ పీ ఓ ఎల్ ఆర్ లోను దరఖాస్తు తీసుకోవడం లేదు. వాస్తవానికి ప్రభుత్వం సమస్యలున్న భూముల పరిష్కారానికి అవకతవకలు ఉన్న వాటి పరిష్కారం కోసం తాసిల్దార్లకు ఈ ప్రత్యేక లాగిన్ కేటాయించింది అయితే ప్యూర్లీ పట్టా ల్యాండ్ సే ఆన్లైన్ నమోదుకు నోచుకోకపోతే సమస్యలను భూమిలోని పరిష్కరించడం తాసిల్దారులకు సాధ్యమేనా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి

## ఇనాం భూముల పరిస్థితి ఏంటో..?

మ్యుటేషన్ సమస్య ఒకవైపున రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంటే మరోవైపు రెండు కోట్ల ఖాతా మరింత ఆందోళన గురిచేస్తోంది. సహజంగా ప్రభుత్వములకు సంబంధించి రెండు కోట్ల ఖాతా అనేది ఉంటుంది. అయితే చాలావరకు పట్టా ల్యాండ్ కు సంబంధించి కూడా రెండు కోట్ల ఖాతా పెట్టేశారు. అలాగే ఇనాం భూములు సంబంధించి 1964 లోనే వాటిని క్రమబద్ధీకరించారు. అయితే రీసర్వే లో వీటిని తిరిగి ఇనాం భూములుగా పెట్టేశారు. దీంతో బాధిత రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పై రెండు సమస్యలు పరిష్కరించడం తహసీల్దారుల పరిధిలో లేకుండా చేశారు. రెండు కోట్ల ఖాతా తొలగించాలన్న.. ఇనా ము భూములను తొలగించి తిరిగి పట్ట భూములుగా చేయాలన్న అది జేసి పరిధిలో మాత్రమే ఉంది. దీంతో సామాన్య రైతులు, పేదలు జాయింట్ కలెక్టర్ వద్దకు వెళ్లి ఈ సమస్యను పరిష్కరించుకునే పరిస్థితి కనిపించడం లేదు ఏదేమైనా ఇలాంటి లోప భూఇష్ట విధానాలను ప్రభుత్వం సరి చేయాల్సినా అవసరం ఎంతయినా ఉంది.

# ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం

- మంత్రి గొట్టిపాటి రవికుమార్



**గన్నవరం, జూలై 7(మనం న్యూస్):** అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటిని నెరవేరుస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో సోమవారం ఉదయం ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తో కలిసి సూపర్ పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకు న్నారు.

ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సంవత్సర కాలంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తుందని ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని ఈ విషయంలో ఏవిధమైన అపోహలకు తావు లేదని తేల్చి చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలో ఎక్కువ మంది ఇళ్ల స్థలాలు కావాలని అడుగుతున్నారని ఈ విషయం ఇప్పటికే ప్రభుత్వం దృష్టిలో ఉందని ప్రభుత్వ నిర్ణయం మేరకు అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ విజయవాడ రూరల్ మండలం గన్నవరం నియోజకవర్గంలోని గ్రామాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో చర్చించి విజయవాడ మున్సిపాలిటీలో కలిపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గడ్డల చిన్న రామారావు, గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షులు చాగంటి కృష్ణ, కోనేరు సందీప్, కొల్ల ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు



**కర్నూలు, జూలై 7(మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాల నిరసిస్తూ జూలై 9న కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు నిర్వహిస్తున్నారని, ఈ సమ్మెకు సిపిఐ సంపూర్ణంగా మద్దతి స్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, కర్షక విధానాలు చాలా దుర్మార్గంగా ఉన్నాయని 44 లేబర్ చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా కుదించడం, పని గంటలు పెంచడం ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా సంపన్న వర్గాలకు అమ్మి వేయడం ప్రైవేటీకరణ చేయడం, జరుగుతుందని, దీని కారణంగా ఉద్యోగులకు, కార్మికులకు భద్రత లేకుండా పోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక ఉద్యోగ రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాల నిరసిస్తూ దేశ వ్యాప్తంగా జాతీయ కార్మిక సంఘాల ఉద్యోగ సంఘాలు రైతు సంఘాల వ్యవసాయ కార్మికులు సమ్మెలో కోట్లాది మంది పాల్గొంటున్నారని, సమ్మెలో సిపిఐ నాయకులు, శ్రేణులు ప్రత్యక్షంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## పీజీఆర్ఎస్పై వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం తప్పనిసరి

- సబ్ కలెక్టర్



**ఆదోని, జూలై 7(మనం న్యూస్):** పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం లో వచ్చిన ప్రతి అర్జీని గడువు లోపు పరిష్కరించాలి. ఏ ఒక్క అధికారికి కూడా నిర్లక్ష్యానికి అవకాశం ఉండకూడదని, సమస్యల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ స్పష్టం చేశారు. ఆదివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫైళ్లను బియాండ్ ఎస్ఎల్ఏ (సర్వీస్ లెవల్ అగ్రిమెంట్) లోకి వెళ్లనివ్వకూడదు. ప్రజలు ఇచ్చిన వినతులపై సత్వర నిర్ణయాలు తీసుకుని, వారికి సంతృప్తికరమైన సేవలు అందించాలి అని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎల్డిఓ బాలకృష్ణారెడ్డి, డిఎల్పిఓ తిమ్మక్క, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, వ్యవసాయశాఖ అధికారులు బాలవర్ధి రాజు, ఆర్టీవో పరిపాలన అధికారి రమాదేవి, డిప్యూటీ డిఎంహెచ్ఓ సత్యవతి, పౌర సరఫరాల శాఖ ఉప తహశీల్దారు రుద్ర గౌడ్ తది తరులు పాల్గొన్నారు.

## బదినేహాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావోత్సవం



**కౌతాళం, జూలై 7(మనం న్యూస్):** మాదిగల ఆత్మగౌరవ ప్రతీక మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 31వ సంవత్సరం ఆవిర్భావ వేడుకను కౌతాళం మండలం బదినేహాల్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు సల్మాన్ రాజు ఎమ్మార్పీఎస్ కౌతాళం మండల అధ్యక్షులు గుడి కంబాళి ఆనంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఎఫ్ సీనియర్ నాయకు ఆరెకంటి భాస్కర్ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. దాని తో పాటుగా మంద కృష్ణ మాదిగ అన్న పుట్టినరోజు వేడుకలు కుడా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజుఅన్న అలాగే బదినేహాల్ గ్రామ మండల ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి అయిన చిన్న, రమేష్, వీరేష్ నాగరాజు, ఉమేష్ యాంకప్ప, ఈరన్న, స్థానిక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## వివక్ష లేని సమాజ స్థాపనే ఎమ్మార్పీఎస్ లక్ష్యం



**కౌతాళం, జూలై 7(మనం న్యూస్):** కౌతాళం మండలం వివిధ గ్రామాల్లో ఘనంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సమాజంలో దళితులు పై వివక్ష లేని సమాజ స్థాపనే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి లక్ష్యం అని మాదిగ ఎంప్లాయి ఫెడరేషన్ నాయకులు ఆరేకంటి భాస్కర్, మంత్రాలయం నియోజకవర్గం యం ఆర్ పి యస్ ఇన్ చార్జి బండారి హనుమంతు అన్నారు వారు కౌతాళం మండలం బదినేహాల్, ఏరిగేరి, బాపురం, లింగల దిన్ని గ్రామాలలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యం ఆర్ పి యస్ జెండా ఆవిష్కరణ చేశారు యం ఆర్ పి యస్ సీనియర్ నాయకులు సల్మాన్ రాజు అధ్వర్యంలో మండల అధ్యక్షులు గుడికంభాలి ఆనంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఎఫ్ నాయకులు భాస్కర్, నియోజకవర్గం ఇన్చార్జి బండారి హనుమంతు మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30 సంవత్సరాలు అనేక పోరాటాలు చేసి ఏబీసీడీ వర్గీకరణ సాధించింది అని బడుగు బలహీన వర్గాల కోసం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం పని చేస్తుంది అని వారు అన్నారు అనంతరం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు శ్రీ పద్మశ్రీ మందా క్రిష్ణ మాదిగ జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యం ఆర్ పి యస్ జిల్లా నాయకులు రాజు,యం యస్ పి మండల అధ్యక్షులు శంకర్,బదినేహాల్ చిన్న,తోవి ఈరన్న, వీరేష్, రమేష్, యం ఆర్ పి యస్ మండల ఉపాధ్యక్షులు ఏరిగేరి విరేష్,ప్రదాన కార్యదర్శి రామాంజనేయులు, బిజేపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విజయ్ కుమార్, ఆనంద్, శివ, లింగలదిన్ని నాగరాజు, సంపత్, బాపురం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'మండీని వదిలేసి టెక్సాస్ వరదలపై విచారమా!'

### మోదీపై కాంగ్రెస్ విమర్శలు



**ఢిల్లీ, జూలై 7:** ప్రధాని నరేంద్ర మోడీపై కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా తీవ్ర విమర్శలు చేశారు. అమెరికాలోని టెక్సాస్లో వరదలపై ప్రధాని విచారం వ్యక్తం చేయడాన్ని తప్పుబట్టారు. హిమాచల్ ప్రదేశ్లోని మండిలో వరదల కారణంగా జరుగుతున్న ప్రాణ నష్టం, విధ్వంసంపై ఒక్క మాట కూడా మాట్లాడని మోడీ.. అమెరికాలో వస్తున్న వరదలపై మాత్రం విచారం వ్యక్తం చేస్తున్నారని మండిపడ్డారు. ''హిమాచల్ ప్రదేశ్లో వర్షాలు సృష్టిస్తున్న బీభత్సం వల్ల 70కిపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. కొండచరియలు విరిగిపడి ఇళ్లు ధ్వంసం కావడంతో వందల మంది నిరాశ్రయులయ్యారు. ఇంత విధ్వంసం జరిగినా ప్రధాని మోడీ అక్కడి ప్రజలకు ధైర్యం కలిగించేలా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. టెక్సాస్ వరదలపై మాత్రం విచారం వ్యక్తం చేస్తున్నారు. విదేశీయుల జీవితాల కంటే భారత ప్రజల జీవితాలు అంత చులకనగా మారాయా? ప్రజలపై చూపించే జాలి కూడా రాజకీయంగా మారిపోయిందా?''అంటూ పవన్ ఖేరా ప్రధానిని ప్రశ్నించారు. టెక్సాస్లో సంభవించిన వరదల కారణంగా అక్కడి ప్రజలు, ముఖ్యంగా పిల్లలు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా బాధించిందని పేర్కొంటూ ప్రధాని మోడీ ఇటీవల సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు.

## మస్క్ గాడి తప్పాడు.. కొత్త పార్టీ ప్రకటనపై ట్రంప్ ఫైర్





వాషింగ్టన్, జూలై 7: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య మరోసారి వైరం నెలకొంది. అధ్యక్షుడు తీసుకొచ్చిన బిగ్ బ్యూటిఫుల్ బిల్లును బహిరంగంగా వ్యతిరేకించిన మస్క్ .. అన్నట్లుగానే కొత్త పార్టీని ప్రకటించారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ టెస్లా అధినేతపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన గాడితప్పారని, పార్టీ ప్రకటన హాస్యాస్పదమని మండిపడ్డారు. ఈ మేరకు తన ట్రూత్ ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ చేశారు. 'గత ఐదు వారాలుగా ఎలాన్ మస్క్ పూర్తిగా నియంత్రణ కోల్పోవడం విచారకరం. మా మధ్య బంధాన్ని దారుణంగా ముగించేస్థితికి ఆయన చేరుకున్నారు. అమెరికాలో మూడో రాజకీయ పార్టీ అనేది విజయవంతం కాదని, అలాంటి వ్యవస్థను అమెరికన్లు అంగీకరించరని చరిత్ర చెబుతోంది. అయినా కొత్త పార్టీని ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. రెండు పార్టీల వ్యవస్థను అనుసరిస్తున్న దేశంలో ఇలాంటి మూడో పార్టీ గందరగోళానికి, ఘర్షణలకు తావిస్తుంది' అని ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు.'ప్రస్తుతం డెమోక్రాట్లలో విశ్వాసం సన్నగిల్లింది. రిపబ్లికన్ల ప్రభుత్వం సజావుగా నడుస్తోంది. ఇటీవల దేశ చరిత్రలోనే తొలిసారి ఓ భారీ బిల్లును ఆమోదించుకున్నాం. అది చాలా గొప్ప బిల్లు.. కానీ, మస్కుకు మాత్రం కాదు. ఎందుకంటే దానివల్ల మస్క్ కోరుకుంటున్న తప్పనిసరి ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం సాధ్యం కావట్లేదు. చాలా తక్కువ సమయంలో ప్రతిఒక్కరూ ఎలక్ట్రిక్ కారును కొనుగోలు చేయాలని ఆయన కోరుకుంటున్నారు. దీన్ని నేను ముందునుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా. ఈ బిల్లుతో ఇప్పుడు ప్రజలు తమకు నచ్చిన వాహనాన్ని కొనుగోలు చేయొచ్చు. అమెరికా ప్రజలను రక్షించడానికే నా మొదటి ప్రాధాన్యం' అని ట్రంప్ తన పోస్ట్లో స్పష్టంచేశారు.

'అమెరికా పార్టీ'ని స్థాపిస్తున్నట్లు మస్క్ 'ఎక్స్' వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికాలో ప్రస్తుతం ప్రజాస్వామ్యం లేదని, ప్రజలకు స్వేచ్ఛ ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. తన పార్టీ ద్వారా దేశంలోని ద్విపార్టీ వ్యవస్థను సవాలు చేయనున్నట్లు వివరించారు. అయితే తన పార్టీని ఎక్కడ రిజిస్టరు చేసేదీ ఆయన వెల్లడించలేదు.

# బాధితులకు బాసటగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ

- సీయం సహాయ నిధి ద్వారా ఆప్తులకు ఆపన్నహస్తం
- ఎనిమిది మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన దగ్గుమళ్ళ ప్రసాదరావు
- చిత్తూరు పార్లమెంటు సభ్యునికి కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబాలు



**చిత్తూరు, జూలై 7(మనం న్యూస్):** చిత్తూరు పార్లమెంటు పరిధిలోని పలు బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు... ఆపదలో ఉన్న ఆప్తులకు ఆపన్న హస్తాన్ని అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎనిమిది మంది బాదితులకు సుమారు 13,27,560 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకున్నారు. చిత్తూరులోని ఎంపీ కార్యాలయంలో బాధితులకు సీఎం రిలీజ్ ఫండ్ చెక్కులను అందజేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని, పేద ప్రజల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఉన్న చిత్తశుద్ధిని వివరించారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పొందిన వారిలో పెనుమూరు మండలం, పెలితళ్లు గ్రామానికి చెందిన యన్.నాధముని( 42,746), జీడీ నెల్లూరు మండలం, వింజం గ్రామానికి చెందిన కె.మోహన్ రెడ్డి (44,195), ఐరాల మండలం, పొలకల గ్రామానికి చెందిన బేబీ ప్రత్యూష (35,917), పుంగనూరు, తేరు వీధికి చెందిన బి.విజయ కుమార్ (2,00,000), ఐరాల మండలం, ఐరాల గ్రామానికి చెందిన రాజారెడ్డి (1,15000), వెదురు కుప్పం మండలం పెరుమళ్ళపల్లి గ్రామానికి చెందిన రవిబాబు (2,09,945), చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని 190 రామా పురానికి చెందిన దేవేంద్ర బాబు ( 51,385), తిరుపతి రూరల్ మండలం, మల్లం గుంట గ్రామానికి చెందిన జి.గిరిబాబు (6,28,372) ఉన్నారు. కష్టాలలో ఉన్న వారందరికీ అండగా నిలిచిన కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావుకు ఈ సందర్భంగా బాదిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలియజేశాయి. ప్రజల కష్టాలు తెలిసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు లాంటి వారు చిత్తూరు పార్లమెంటు సభ్యులుగా ఉండటం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

# పండుగ వాతావరణంలో మనం ఆత్మీయ సమ్మేళనం




## జర్నలిస్టుల సంక్షేమానికి కార్యాచరణ షురూ

### సంక్షేమ నిధికి శ్రీకారం.. కార్యవర్గం ఎన్నిక

తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా నామా పురుషోత్తం

ఆంధ్రప్రదేశ్ అధ్యక్షునిగా చెంగల్ రాయులు(గాంధీ)

మనం ఓ కుటుంబం: ఎడిటర్ రమేష్ కుమార్

అనుభూతులు పంచుకుని.. 'మనం'తో అనుబంధాలను పెంచుకుని.. భవిష్యత్ 'దీక్ష' తీసుకున్న సిబ్బంది

















**హైదరాబాద్, మనం ప్రతినిధిః** రెండు తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుస్తోన్న 'మనం' దినపత్రిక నిర్వహించిన 'ఆత్మీయ సమ్మేళనం' ఆరంభం నుంచి ఓ వేడుకగా సాగింది. సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్, ఫౌండర్ ఎడిటర్ వుప్పరి రమేష్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి వచ్చిన జర్నలిస్టులు, సిబ్బందిని పేరుపేరున ఆత్మీయంగా పలుకరించారు. వారి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. సంస్థలో పని చేసే ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులేనన్నారు. మీ సాధకబాధకాలు 'ఫేస్ టు ఫేస్' తెలుసుకునేందుకు ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్టు ఆయన వెల్లడించారు.

#### జర్నలిస్టుల సంక్షేమానికి కార్యాచరణ షురూ..

'మనం'లో పనిచేసే పాత్రికేయులు, సిబ్బంది సంక్షేమం కోసం ఒక నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు ఈ సందర్భంగా రమేశ్ ప్రకటించారు. ఆపత్సమయాల్లో ఆదుకోవడంతో పాటు అనారోగ్యం బారిన పడ్డవారికి ఆర్థిక సహాయం చేయడం, సిబ్బంది పిల్లల విద్య, పెళ్లిళ్లు, సొంతింటి కల సాకారం.. వంటి వాటికి ఆర్థికంగా చేయూతనివ్వడం కోసం ఈ సంక్షేమ కార్యక్రమాన్ని మొదలుపెడుతున్నట్టు రమేశ్ కుమార్ వెల్లడించారు. తన 20 ఏండ్ల నాటి కల ఈ నాడు ఆచరణలో పెడుతున్నందుకు సంతోషం కలుగుతుందని చెప్పారు. ఈ నిర్ణయాన్ని 'మనం దినపత్రిక 'కుటుంబ సభ్యులు' కరతాళ ధ్వనులతో స్వాగతిస్తూ హర్షం వ్యకం చేశారు.

#### తొలి కంట్రిబ్యూషన్ రూ. లక్ష..

తన వంతు 'తొలి' కంట్రిబ్యూషన్‌గా రెండు రాష్ట్రాలకు చెరో లక్ష రూపాయలను అందజేస్తున్నట్టు రమేశ్ కుమార్ ప్రకటించారు. ఇది వచ్చే ఏడాది నాటికి కోటి రూపాయల నిధిని సమకూర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. దసరా పండుగ నుంచి ఇది పూర్తి స్థాయిలో తన పని చేస్తుందని తెలిపారు. తాను ఈ జర్నలిజం వృత్తిలో 25 ఏండ్లుగా ఉన్నానని, అర్ధరాత్రి ఎవరికి ఏ ఆపదొచ్చినా స్పందిస్తానని, సమస్యల పరిష్కారం కోసం అర్ధరాత్రి, అపరాత్రి అనుకోకుండా ముందుండి కృషి చేస్తున్నానని ఆయన చెప్పారు.

#### సంక్షేమ నిధికి అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక..

ఈ ప్రకటిత సంక్షేమాన్ని ప్రతి ఒక్కరికీ అందేలా పర్యవేక్షించడానికి రెండు తెలుగు రాష్ట్రాలకు వేరువేరుగా కమిటీలను నియమించారు. తెలంగాణ కమిటీ తొలి అధ్యక్షుడుగా నామా పురుషోత్తం, కార్యదర్శులుగా శ్రీనివాస్, రవిందర్, కోశాధికారిగా హేమంత్ ఎన్నికయ్యారు. ఏపీ కమిటీకి అధ్యక్షుడుగా చెంగల్‌రాయుడు(గాంధీ), కార్యదర్శిగా రవి ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమ నిధికి అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన చెంగల్ రాయుడు(గాంధీ),రవి చెరో రూ. 10,000 లు విరాళంగా ప్రకటించారు.

'మనం' అన్న పదం భావోద్వేగాలతో కూడిన ప్రేమానుబంధాలకు.. స్నేహపూర్వక సంబంధాలకు సంకేతంగా.. మనలో ఒక అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తుంది. అలాంటిది ఆ పేరుతో ఉన్న పత్రికలో పనిచేయడం అంటే జర్నలిస్టులకు విజ్ఞానం, ఉద్యోగ సంతృప్తితో పాటు నూరు శాతం ఆనందాన్ని, సంతోషాన్నిస్తది. అక్షరాలా ఇలాంటి అనుభూతినే ఇచ్చింది 'మనం' ఆత్మీయ సమ్మేళనం.. 2016లో ఆరంభమైన 'మనం' దినపత్రిక తన ప్రగతిశీల గమనంలో ఎనిమిది వసంతాలు పూర్తి చేసుకుని తొమ్మిదో వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా హైదరాబాద్‌లో 'ఆత్మీయ సమ్మేళనం' జరుపుకుంది. ఆనందోత్సాహాల మధ్యన ఘనంగా జరిగిన ఈ వేడుకలో జర్నలిస్టుల సంక్షేమానికి 'మనం' శ్రీకారం చుట్టి మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. పాత్రికేయుల మేలు కోసం యాజమాన్యం వేసిన ఈ తొలి అడుగు పత్రికా రంగానికే ఆదర్శంగా నిలుస్తుంది.

#### ఉత్తమ జర్నలిస్టులకు అవార్డులు..

మనం దిన పత్రికలో ఈ ఏడాది కాలంలో 'ది బెస్ట్' వార్తలు, కథనాలు రాసి అవార్డులకు ఎన్నికైన వారిని ఈ సమావేశంలో 'ఉత్తమ జర్నలిస్టు' అవార్డులతో సత్కరించారు.

తెలంగాణ రాష్ట్రంలో మొదటి ఉత్తమ జర్నలిస్టుగా నామా పురుషోత్తం, ద్వితీయ ఉత్తమ జర్నలిస్టుగా బుక్కా రాంబాబు, తృతీయ ఉత్తమ జర్నలిస్టులుగా ఎన్నికైన గోపాల్, సంజీవ రెడ్డి, యంగ్ అండ్ డైనమిక్ జర్నలిస్టుగా సుధీర్‌లకు అవార్డును అందజేసి శాలువాతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదటి ఉత్తమ జర్నలిస్టుగా రవి, ద్వితీయ ఉత్తమ జర్నలిస్టుగా చెంగల్ రాయులు(గాంధీ)లకు అవార్డులను పురస్కరించారు.

#### తమ సారథిని ఘనంగా సత్కరించుకున్న మనం సిబ్బంది..

అనంతరం మనం దినపత్రికకు సేవలందిస్తున్న జర్నలిస్టులు, సిబ్బందిని కూడా సత్కరించారు. రెండు రాష్ట్రాల నుంచి కార్యక్రమానికి హాజరైన జర్నలిస్టులందరూ దినపత్రిక సారథి రమేశ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

2016 నుంచి ఆరంభమైన నాటి నుంచి నేడు జరిగిన ఈ కార్యక్రమం ఒక మధుర జ్ఞాపకం గా ఉంటుందని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ... ఈ అవార్డు, సత్కారం మాకు భాధ్యతను పెంచిందన్నారు. సంక్షేమ నిధి ఏర్పాటుతో తమకు 'మనం' అనే ఆపద్బంధు ఉన్నారనే నమ్మకంతో.. యాజమాన్యమిచ్చిన భరోసాతో గుండెనిండా సంతోషంతో తిరిగి వెళుతున్నామని చెప్పారు.













పాశ మైలారంలో కెమికల్ కంపెనీ అగ్నిప్రమాద మృతులకు సంతాపం ప్రకటిస్తున్న సమావేశం

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.